Follow: @ANNTELUGU

10-08-2026

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 218 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ప్రతి ఇంటా త్రివర్ణం

- 'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వాములు కండి.
- స్వాతంత్ర్య వేడుకలకు దేశం సిద్ధం.
- ప్రధాని నరేంద్ర మోదీ.
- వందేమాతరం 150 ఏళ్ల సందర్భంగా ఈసారి ప్రత్యేక కార్యక్రమాలు

**ఢిల్లీ, మహా :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ.. ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ భక్తి, జాతీయ ఐక్యతను చాటాలని కోరారు. త్రివర్ణ పతాకం కేవలం దేశ గర్వానికి ప్రతీక మాత్రమే కాదని.. దేశం కోసం మరింత మెరుగ్గా పనిచేయాలనే స్ఫూర్తిని అందిస్తుందని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా2026'లో చురుగ్గా పాల్గొని వికసిత్ భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రజలు సంకల్పించాలన్నారు. 2022లో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా

మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**

## రష్యా నుంచి భారత్‌కు రైలుమార్గం



- హార్ముజ్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త దారి
- హిందూ మహాసముద్రానికి రైలు అనుసంధానంపై రష్యా దృష్టి

03

## మమతా కాన్వాయ్‌పై రాళ్ల దాడి



- హాలిసహర్‌లో ఉద్రిక్తత
- రాళ్లు, బురద, చెప్పులతో నిరసనకారుల దాడి

02

## హిందూ పండుగలపై వివక్ష ఎందుకు?



- కేటీఆర్‌కు అమ్మవారి దయతోనే జ్ఞానోదయం
- బీజేపీ వస్తే స్వర్ణదేవాలయంగా భాగ్యలక్ష్మి గుడి
- బోనాల సాక్షిగా అధికార, విపక్షాలపై బండి కన్నెర్ర

03




## రష్యాపై సుంకాలు విధిస్తే చమురు ధరలు భగ్గుమంటాయి

02

- అమెరికాకే భారం.. భారత్ ఇప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మాజీ దౌత్యవేత్త కేపీ ఫేబియన్.



## వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి

- రాజమహేంద్రవరం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రియాంక
- కిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్
- పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలింపు
- ప్రియాంక మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది

03

# అంగరంగ వైభవంగా ఏఎన్ఎన్ మహా అవార్డ్స్

### ప్రపంచ ఐటీ రంగంలో తెలుగు యువతదే ఆధిపత్యం

03

- ఏఎన్ఎన్ ఛైర్మన్ కంది శ్రీనివాస రెడ్డి.
- విజయానికి అడ్డదారులు లేవు.
- మాతృభూమికి సేవ చేయడమే నిజమైన గెలుపు.
- ఆరోగ్య, వ్యాపార రంగాల ఆదర్శమూర్తులకు ఘన సత్కారం.

ANN MAHAA AWARDS





**విజయవాడ, మహా :** విజయవాడ నగర నడిబొడ్డున ఉన్న ప్రతిష్టాత్మక తాజ్ వివంతా హోటల్ వేదికగా ఆగస్టు 9వ తేదీ ఆదివారం సాయంత్రం ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. సమాజంలో ఆరోగ్య, వ్యాపార రంగాలలో విశేషమైన సేవలందిస్తూ, తమకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న ఆదర్శమూర్తులను సత్కరించేందుకు 'ఏఎన్ఎన్ , మహా పత్రిక' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెల్త్ అండ్ బిజినెస్ అవార్డ్స్2026' అత్యంత అట్టహాసంగా జరిగాయి. నవ్యాంధ్ర రాజధాని ప్రాంతం నుంచి విచ్చేసిన ఎందరో ప్రముఖ వైద్యులు, కార్పొరేట్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తల రాకతో ఈ మెగా గ్రాండ్ ఈవెంట్ ప్రాంగణం నూతన శోభను సంతరించుకుంది. ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే లక్ష్యంగా సాగిన ఈ వేడుక నగర ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేలా అత్యంత ఘనంగా విజయవంతమైంది. ఈ మహా వేడుకలో

మిగతా 2వ పేజీలో

## పోలీసు శాఖలో సమూల సంస్కరణలు

- తెలంగాణలో మావోయిజం దాదాపు అంతం
- మాదక ద్రవ్యాల కట్టడమే ఇప్పుడు ప్రధాన సవాల్
- డీజీపీ సీవీ ఆనంద్.

02



## పెద్ది ఇంటికి కేసీఆర్

### అనుబంధం తలుచుకుని భావోద్వేగం

**హైదరాబాద్, మహా :** ఇటీవల అకాల మరణం చెందిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి సాదాసీదా జీవితం గడిపారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లిలో జరిగిన పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొన్నారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ

మిగతా 2వ పేజీలో





## కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్ల సత్తా

- 39 పతకాలతో మెరిసిన భారత్.
- విజేతలకు ప్రధాని మోదీ అభినందనలు.

**ఢిల్లీ, మహా :** కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో దేశానికి గర్వకారణంగా నిలిచారు. మొత్తం 39 పతకాలు సాధించి సత్తాచాటారు. ఇందులో 13 స్వర్ణం, 17 రజతం, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన భారత క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. భారత అథ్లెట్ల విజయాలను దేశం గర్వించదగ్గ ఘనతగా ప్రధాని మోదీ అభివర్ణించారు. క్రీడాకారుల కఠోర శ్రమ, పట్టుదల, అంకితభావానికి ఈ పతకాలే నిదర్శనమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.కామన్వెల్త్ గేమ్స్‌లో సాధించిన విజయాలు దేశంలోని యువ క్రీడాకారులకు మరింత స్ఫూర్తినిస్తాయని మోదీ అన్నారు. రాబోయే అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారులు మరింత మెరుగైన ప్రదర్శనతో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు



## హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?

### ఎస్ఐఆర్ తుది గణాంకాలపై ఉత్కంఠ

### సనత్‌నగర్‌లో ఏకంగా 45.68 శాతం ఓట్లపై వేటు!

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సోమవారంతో ముగియనుండటంతో హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యపై ఉత్కంఠ నెలకొంది. బీఎల్‌వోలకు అందిన ఎన్యూమరేషన్ ఫారాల పరిశీలన, డిజిటలైజేషన్ అనంతరం రాజధాని పరిధిలో భారీగా ఓట్లు తగ్గే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు సూచిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని 28 నియోజకవర్గాల్లో కలిపి దాదాపు

మిగతా 3వ పేజీలో




# ప్రతి ఇంటా త్రివర్ణం



( మొదటి పేజీ తరువాయి )

ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రస్తుతం దేశవ్యాప్తంగా కోట్లాది మంది స్వచ్ఛందంగా పాల్గొనే జాతీయ ఉద్యమంగా మారింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం, త్రివర్ణ పతాకంతో ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడం, దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా కేంద్రం పేర్కొంది.

**వందేమాతరానికి 150 ఏళ్లు**

ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. జాతీయ గేయం 'వందేమాతరం' రూపకల్పనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈసారి కార్యక్రమాలను వందేమాతరానికి అంకితం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆగస్టు 6న ప్రారంభమైన ప్రచారంలో భాగంగా ఆగస్టు 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**తిరంగా యాత్రలు.. బైక్ ర్యాలీలు**

ఈసారి 'హర్ ఘర్ తిరంగా'ను ప్రజల భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు. తిరంగా యాత్రలు, ర్యాలీలు, తిరంగా కచేరీలు, బైక్, సైకిల్ ర్యాలీలతో పాటు రంగోలి పోటీలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ ప్రాంతాల్లో త్రివర్ణ పతాక రంగులతో ప్రత్యేక అలంకరణలు, లైటింగ్ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ప్రజలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి.. దానితో సెల్ఫీ తీసుకుని 'హర్ ఘర్ తిరంగా' అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు కోరుతున్నారు. తద్వారా దేశవ్యాప్తంగా ప్రతి ఇంటినీ త్రివర్ణ పతాకంతో అనుసంధానించాలన్నది కార్యక్రమం లక్ష్యం.

**దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన దేశభక్తి**

'హర్ ఘర్ తిరంగా2026'లో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే భారీ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరిలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తిరంగా యాత్రలో పాల్గొన్నారు. ఉత్తరాఖండ్ దెహ్రాదూన్, జమ్మూకశ్మీర్ పుల్వామా, మణిపూర్ ఇంఫాల్, సిక్కిం గ్యాంగ్‌టక్ తదితర ప్రాంతాల్లోనూ భారీ ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అండమాన్-నికోబార్ దీవుల రాజధాని శ్రీ విజయపురంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త ఊపునిచ్చిందని ఆయన గుర్తుచేశారు. దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.త్రివర్ణ పతాకం దేశ గర్వం, ఐక్యతకు ప్రతీక అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పేర్కొనగా.. ప్రతి ఇంట్లోనే కాకుండా ప్రతి భారతీయుడి హృదయంలోనూ త్రివర్ణం భాగం కావాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా2026'ను దేశవ్యాప్తంగా దేశభక్తి పండగగా జరుపుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కోరారు.






# అంగరంగ వైభవంగా ఏఎన్ఎన్ మహా అవార్డ్స్

( మొదటి పేజీ తరువాయి )

ఏఎన్ఎన్ గ్రూప్ ఎండీ శ్రీ కంది శ్రీనివాస రెడ్డి గారు చేసిన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదిలాబాద్ జిల్లాలోని ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, అమెరికాలో 835 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించే బహుళ జాతీయ ఐటీ కంపెనీని స్థాపించి, ఏకంగా 1700 మందికి ఉపాధి కల్పిస్తున్న తన అద్భుత జీవన ప్రయాణాన్ని ఆయన సభికులతో పంచుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి ఎదురైనా మొక్కవోని దీక్షతో ప్రజా సేవలో కొనసాగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. కష్టాన్ని నమ్ముకుని, ఎటువంటి అడ్డదారులు (షార్ట్ కట్స్) వెదకకుండా నిజాయితీగా పనిచేస్తే విజయం తథ్యమని యువతకు ఆయన దిశానిర్దేశం చేశారు. సీఈఓ కంది రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో 'అమ్మ న్యూస్ నెట్‌వర్క్'గా, ఆంధ్రాలో 'ఆంధ్రా న్యూస్ నెట్‌వర్క్'గా ఏఎన్ఎన్ విస్తరించి నిత్యం ప్రజలకు సేవ చేస్తోందని ఆయన వివరించారు.

ప్రపంచ ఐటీ రంగంలో తెలుగువారి ఆధిపత్యాన్ని శ్రీ కంది శ్రీనివాస రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సాఫ్ట్‌వేర్ కోడింగ్, గణితం మరియు సాంకేతిక రంగాలలో ప్రపంచంలో మన యువతను మించిన వారు లేరని ఆయన బల్లగుద్ది మరీ స్పష్టం చేశారు. అమెరికాలో ఎలాంటి మార్పులు వచ్చినా తెలుగు వారి నైపుణ్యానికి ఎలాంటి డోకా ఉండదని భరోసా ఇచ్చారు. యువత ఉన్నత చదువుల కోసం ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లొచ్చని, కానీ భవిష్యత్తులో పది పదిహేనేళ్ల తర్వాత తప్పకుండా మాతృభూమికి తిరిగి వచ్చి తమ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు. సమాజానికి మన వంతుగా ఏదైనా తిరిగి ఇవ్వాలన్నదే తమ ఫౌండేషన్ మరియు సంస్థల ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.






సమాజం భౌతికంగా ఎంతగా అభివృద్ధి చెందుతున్నా, మనిషి మాత్రం తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నాడన్న వాస్తవాన్ని ఈ వేదికపై పలువురు వక్తలు సోదాహరణంగా వివరించారు. ఆధునిక విద్యా వ్యవస్థలో పసిపిల్లలపై మోపుతున్న అనవసరమైన బరువులు, కేవలం ర్యాంకుల కోసమే తల్లిదండ్రులు తెస్తున్న తీవ్ర ఒత్తిళ్లు విపత్కర పరిస్థితులకు దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో వాట్సాప్ లాంటి సోషల్ మీడియా వేదికగా నిత్యం ప్రచారమవుతున్న ఫేక్ న్యూస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మనిషికి ఎన్ని వందల కోట్లు ఉన్నా ప్రశాంతమైన జీవితం, ఆరోగ్యమే మహా భాగ్యమని ఉద్ఘాటించారు. ప్రతి ఇంటా కరివేపాకు, ములగ లాంటి ఔషధ గుణాలున్న మొక్కలను పెంచుకోవాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కల్తీ లేని ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య రంగ నిపుణులు, వినూత్న ఆలోచనలతో వాణిజ్య రంగాన్ని పరుగులు పెట్టిస్తున్న యువ పారిశ్రామికవేత్తలను నిర్వాహకులు వేదికపైకి ఆహ్వానించి స్వర్ణ వర్ణపు ప్రతిష్టాత్మక జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. విభిన్న రంగాల నుంచి వచ్చిన ప్రతినిధుల మధ్య అమూల్యమైన ఆలోచనల మార్పిడికి వేదికైన ఈ మెగా ఈవెంట్ ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆహూతులను విశేషంగా అలరించిన లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలతో ఈ మహా వేడుక ఆద్యంతం ఉల్లాసంగా సాగి, విజయవాడ చరిత్రలో ఒక అపురూపమైన మధుర స్మృతిగా ముగిసింది.











# మమతా కాన్వాయ్‌పై రాళ్ల దాడి

**హాలిసహర్‌లో ఉద్రిక్తత**

**కోల్‌కతా, మహా :** పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కాన్వాయ్‌పై నిరసనకారులు రాళ్లు, బురద, చెప్పులు విసిరారు. పోలీసుల భద్రత మధ్యే కొందరు వ్యక్తులు ఆమె వాహనాన్ని అడ్డుకుని నినాదాలు చేస్తూ దాడికి పాల్పడటంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.పోలీసు కస్టడీలో మృతి చెందిన టీఎంసీ కార్యకర్త బిర్జు కియోత్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ హాలిసహర్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె కాన్వాయ్‌ను కొందరు నిరసనకారులు అడ్డుకున్నారు. వాహనాలపై బురద పూయడంతో పాటు రాళ్లు, చెప్పులు విసిరినట్లు ప్రత్యక్ష కథనాలు పేర్కొన్నాయి. పోలీసులు నిరసనకారులను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ కొంతసేపు ఉద్రిక్తత కొనసాగింది.ఘటన అనంతరం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలోనే తన వాహనంపై పెద్ద రాళ్లు, ఇటుకలు, బురద విసిరారని ఆరోపించారు. కారు కిటికీలు తెరిచి ఉంటే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేదని, తన ప్రాణానికే ముప్పు ఏర్పడేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భద్రత కోసం పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ బీజేపీ తీవ్రంగా స్పందించింది. మమతా బెనర్జీపై జరిగిన దాడిని ఖండించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య.. ఈ ఘటనతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిర్జు కియోత్ మృతిపై ఇప్పటికే రాజకీయ దుమారం రేగుతోంది. పోలీసు కస్టడీలో ఆయన మరణించడంపై టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇదే సమయంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మమతా బెనర్జీ కాన్వాయ్‌పై దాడి జరగడంతో వివాదం మరింత ముదిరింది. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పరాజయం తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో అధికార మార్పు చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో టీఎంసీ-బీజేపీ మధ్య రాజకీయ వైరం మరింత తీవ్రరూపం దాల్చింది. ఎన్నికల అనంతరం చోటుచేసుకుంటున్న ఘర్షణలు, నేతలపై నిరసనలు, కార్యకర్తలపై దాడుల ఆరోపణలు రాష్ట్రంలో రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. మమతా బెనర్జీ కాన్వాయ్‌పై తాజా దాడి కూడా ఈ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి దాడికి పాల్పడిన వారిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దాడి వెనుక రాజకీయ కుట్ర ఉందన్న ఆరోపణలకు ఇప్పటివరకు స్వతంత్ర నిర్ధారణ లభించలేదు. ఈ ఘటనతో హాలిసహర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# పోలీసు శాఖలో సమూల సంస్కరణలు

**వరంగల్, మహా :** తెలంగాణ పోలీసు శాఖలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సమూల మార్పులు, సంస్కరణలు చేపడుతున్నామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలో మావోయిజం, నక్సలిజం దాదాపు అంతమైందని, మావోయిస్టు ప్రధాన కేడర్ అంతా లొంగిపోయిందని చెప్పారు. కర్రెగుట్టలు సహా కొన్ని ప్రాంతాల్లో మాత్రం మావోయిస్టుల ఉనికి ఉన్నట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించడంతోపాటు వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆదివారం వరంగల్ జిల్లాలో పర్యటించిన డీజీపీ.. పలు కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు.ములుగులో లొంగిపోయిన మావోయిస్టులతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడనున్నట్లు డీజీపీ తెలిపారు. మావోయిస్టు కుటుంబాల సంక్షేమం కోసం పోలీసు శాఖ తరఫున చేయాల్సిన సహాయం చేస్తామని చెప్పారు. తన ఐపీఎస్ ప్రస్థానం వరంగల్ నుంచే ప్రారంభమైందని గుర్తుచేసుకున్న సీవీ ఆనంద్.. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని అన్నారు.

**భద్రత తగ్గింపుపై రాజకీయాలు వద్దు**

రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గడంతో రాజకీయ నాయకులకు కల్పిస్తున్న భద్రతను ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే సమీక్షించామని డీజీపీ తెలిపారు. గన్‌మెన్‌లను పూర్తిగా తొలగించలేదని, అవసరమైన భద్రతను కొనసాగిస్తూనే సంఖ్యను తగ్గించామని స్పష్టం చేశారు. భద్రత తగ్గింపుపై కొందరు రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.భద్రతా కమిటీ సమగ్రంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వ్యక్తిగత నిర్ణయాలతో భద్రతను తగ్గించలేదని స్పష్టం చేశారు.

**డ్రగ్స్‌పై కొత్త వ్యూహం**

ప్రస్తుతం తెలంగాణ పోలీసుల ముందున్న ప్రధాన సవాల్ మాదక ద్రవ్యాల నియంత్రణ అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త వ్యూహాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. మారుతున్న నేర పరిస్థితులకు అనుగుణంగా పోలీసు విభాగంలోనూ మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు.గ్రేహౌండ్స్‌తో పాటు కొన్ని ఇతర పోలీసు విభాగాల పనితీరు, నిర్మాణంలో మార్పులు చేపట్టనున్నట్లు డీజీపీ వెల్లడించారు. మొత్తం పోలీసు శాఖను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సంస్కరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్లలో ప్రజలకు అందాల్సిన సాధారణ సేవలు, రోజువారీ విధులు యథావిధిగా కొనసాగుతాయని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు

# రష్యాపై సుంకాలు విధిస్తే చమురు ధరలు భగ్గుమంటాయి

- **అమెరికాకే భారం.. భారత్ ఇప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.**
- **మాజీ దౌత్యవేత్త కేపీ ఫేబియన్.**

**ఢిల్లీ, మహా :** రష్యాపై ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన బిల్లు చట్టరూపం దాల్చి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాని ఆధారంగా భారీ సుంకాలు విధిస్తే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉందని మాజీ దౌత్యవేత్త కేపీ ఫేబియన్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆర్థికంగా పలు సవాళ్లు ఎదుర్కొంటున్న అమెరికా.. చమురు ధరలు భారీగా పెరిగే పరిస్థితిని ఎంతవరకు తట్టుకోగలదన్నదే అసలు ప్రశ్న అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రష్యా చమురు కొనుగోళ్లపై భారత్ ఇప్పటికిప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

రష్యాపై ఆంక్షలకు సంబంధించిన బిల్లును అమెరికా సెనేట్ 8611 ఓట్లతో ఆమోదించిన విషయాన్ని ఫేబియన్ గుర్తుచేశారు. అయితే బిల్లు ఇంకా ప్రతినిధుల సభ ఆమోదం పొందాల్సి ఉందని తెలిపారు. ప్రతినిధుల సభ బిల్లులో మార్పులు సూచిస్తే అది మరోసారి సెనేట్‌కు వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. యథాతథంగా ఆమోదించినా తదుపరి దశలో అధ్యక్షుడి నిర్ణయం కీలకంగా మారుతుందని చెప్పారు.

**ట్రంప్‌కు అంత సులభం కాదు..**

రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడికి లభిస్తే.. దాన్ని ట్రంప్ అమలు చేస్తారా? అన్నది ఇప్పుడే చెప్పలేమని ఫేబియన్ అన్నారు. ఒకవేళ సుంకాలు అమల్లోకి వస్తే రష్యా నుంచి ప్రపంచ మార్కెట్లకు వచ్చే చమురు సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని, ఫలితంగా ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని వివరించారు.చమురు ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం రష్యా, భారత్ వంటి దేశాలకే పరిమితం కాదని.. అమెరికా సహా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ద్వారా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు అధికమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న అమెరికాకు ఇలాంటి పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

భారత్ ఇప్పుడే భయపడాల్సిన అవసరం లేదు

రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాలు విధించే ప్రతిపాదన నేపథ్యంలో భారత్‌పై కూడా ప్రభావం పడుతుందన్న చర్చ జరుగుతున్నప్పటికీ.. బిల్లు ఇంకా చట్టంగా మారలేదని ఫేబియన్ గుర్తుచేశారు. ప్రతినిధుల సభలో బిల్లు పరిస్థితి, దానిలో వచ్చే మార్పులు, చివరకు ట్రంప్ తీసుకునే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని అన్నారు.అందువల్ల భారత్ ఇప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. తుది నిర్ణయం వెలువడే వరకు పరిణామాలను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**లిండ్సే గ్రాహం ప్రతిపాదన**

రష్యా చమురు ఆదాయాన్ని తగ్గించడం ద్వారా ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు లభిస్తున్న ఆర్థిక వనరులను నియంత్రించాలన్న ఉద్దేశంతో ఈ ప్రతిపాదన ముందుకొచ్చింది. దివంగత అమెరికా నేత లిండ్సే గ్రాహం ఈ చర్యకు కీలకంగా కృషి చేశారు. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కల్పించాలన్నది ఈ ప్రతిపాదనలోని ప్రధాన అంశం.అయితే అధ్యక్షుడికి సుంకాల విషయంలో విస్తృత అధికారాలు కల్పించే ఈ బిల్లును అమెరికా ప్రతినిధుల సభ యథాతథంగా ఆమోదిస్తుందా? లేక మార్పులు చేస్తుందా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బిల్లు తుది రూపం దాల్చే వరకు భారత్‌పై పడే ప్రభావాన్ని అంచనా వేయడం తొందరపాటు అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.



# పెద్ది ఇంటికి కేసీఆర్

## అనుబంధం తలుచుకుని భావోద్వేగం

( మొదటి పేజీ తరువాయి )

సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్దితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని, కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఉద్యమ ఘట్టాల ఫొటోలు చూస్తూ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పార్టీ పరంగా రూ.2.5 కోట్ల చెక్కులను కుటుంబ సభ్యులకు అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.40 నిమిషాల పాటు గడిపిన కేసీఆర్ : నల్లబెల్లిలోని పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసానికి చేరుకున్న కేసీఆర్, ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పెద్ది కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. సుదర్శన్‌రెడ్డి ఇంట్లో 40 నిమిషాల పాటు గడిపిన కేసీఆర్, అనంతరం పెద్ది అభిమానులకు అభివాదం చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు భారీగా హాజరయ్యారు. దీంతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. జోహార్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు.





# వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి

- **కిమ్స్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్.**

**సికింద్రాబాద్, మహా.** రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక ఆదివారం మృతిచెందారు. మూడు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. ఈ మేరకు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనలో ప్రియాంక తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ కిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి మూడు రోజులుగా వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆమె బ్రెయిన్‌డెడ్‌గా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె మృతదేహాన్ని కిమ్స్ ఆస్పత్రిలోనే భద్రపరిచారు. ప్రియాంక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు రాజమహేంద్రవరం పోలీసులు సికింద్రాబాద్‌కు రానున్నారు. ఆమె తండ్రి వెంకటేశ్ ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఉన్నట్లు సమాచారం. ఆయన వచ్చిన అనంతరం పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కారుతో ప్రియాంకను ఢీకొట్టిన ఘటనపై రాజమహేంద్రవరం పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్న పోలీసులు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రియాంక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పలువురిని కలచివేసింది.

# రష్యా నుంచి భారత్‌కు రైలుమార్గం

**హార్ముజ్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త దారి.**



**మాస్కో, మహా :** హార్ముజ్, బోస్ఫరస్ జలసంధుల్లో తలెత్తుతున్న భద్రతా, రవాణా సమస్యలకు ప్రత్యామ్నాయం వెతుకుతున్న రష్యా.. హిందూ మహాసముద్రం వరకు రైల్వే అనుసంధానం ఏర్పాటుపై దృష్టి సారించింది. భారత్‌కు చేరుకునే మార్గాన్ని కూడా పరిశీలించాలని రష్యా ఉపప్రధాని మరాత్ ఖుస్నుల్లిన్ ప్రతిపాదించారు. తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రానికి చేరే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించవచ్చని ఆయన సూచించినట్లు రష్యా ప్రభుత్వ ఆధారిత వార్తా సంస్థ టాస్ వెల్లడించింది. 'హిందూ మహాసముద్రానికి రైల్వే మార్గాన్ని కూడా అన్వేషించాలి. బోస్ఫరస్, హార్ముజ్ జలసంధులకు సంబంధించిన ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలు అవసరం కావచ్చు. తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా వెళ్లే మార్గాలను పరిశీలించవచ్చు. భారత్‌కు ప్రవేశం కల్పించే ఏ మార్గమైనా ఆమోదయోగ్యమే' అని ఖుస్నుల్లిన్ పేర్కొన్నట్లు టాస్ తెలిపింది. అయితే ఇది ప్రస్తుతం ఖరారైన రైల్వే ప్రాజెక్టు కాదు. కొత్త కారిడార్ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్న ప్రతిపాదన మాత్రమే. మార్గం, వ్యయం, భద్రత, ఆయా దేశాల సహకారం, రైల్వే మౌలిక సదుపాయాల అనుసంధానం వంటి అనేక అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అందువల్ల రష్యా నుంచి భారత్‌కు త్వరలోనే నేరుగా రైళ్లు నడుస్తాయన్న అర్థం చేసుకోవడం తొందరపాటు అవుతుంది.

**సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయం**

ప్రస్తుతం రష్యా-భారత్ వాణిజ్యంలో సముద్ర మార్గాలు కీలకంగా ఉన్నాయి. అయితే హార్ముజ్ జలసంధిలో ఏర్పడుతున్న భద్రతా సమస్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సరకు రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలకమైన సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ భూ రవాణా మార్గాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచనకు ప్రాధాన్యం పెరిగింది. తాజా రష్యా ప్రతిపాదన కూడా ఇదే నేపథ్యంలో తెరపైకి వచ్చింది. ప్రతిపాదిత వ్యవస్థ పూర్తిగా ఒకే రైల్వే లైన్‌గా కాకుండా మల్టీమోడల్ రవాణా కారిడార్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. రష్యా నుంచి రైలులో సరకు మధ్య ఆసియా, ఇరాన్ లేదా అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దిశగా తరలించి.. అక్కడి ఓడరేవుల నుంచి సముద్ర మార్గంలో భారత్‌కు తీసుకురావడం వంటి నమూనాలను పరిశీలించవచ్చు. అంటే రైలు-సముద్ర రవాణాను అనుసంధానించే వ్యవస్థగా ఇది ఉండే అవకాశముంది.

**ఇప్పటికే ఉన్న కారిడార్లకు కొత్త ఊతం**

రష్యా తాజా ప్రతిపాదనకు ఇప్పటికే ఉన్న యూరేషియన్ రవాణా ప్రాజెక్టులతోనూ సంబంధం ఉంది. ముఖ్యంగా ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (INSTC) ద్వారా రష్యా, మధ్య ఆసియా, ఇరాన్, భారత్‌ల మధ్య సరకు రవాణాను వేగవంతం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. హార్ముజ్‌ను పూర్తిగా తప్పించుకునే మార్గాలను అభివృద్ధి చేయాలన్న చర్చలు కూడా తాజా పరిస్థితులతో ఊపందుకున్నాయి. ఇరాన్‌లోని చాబహార్ పోర్టుకు రైల్వే అనుసంధానం కూడా ఈ నేపథ్యంలో వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది. చాబహార్ అరేబియా సముద్రం ద్వారా నేరుగా హిందూ మహాసముద్రంలోకి ప్రవేశం కల్పించే ఓడరేవు కావడంతో.. హార్ముజ్ జలసంధిపై ఆధారపడకుండా సరకు రవాణాకు ఇది ఉపయోగపడే అవకాశముంది. చాబహార్-జహేదాన్ రైల్వే అనుసంధానం పూర్తయితే మధ్య ఆసియా, అఫ్ఘనిస్థాన్ వైపు భూ రవాణా మార్గాలకు కూడా మరింత బలం చేకూరే అవకాశం ఉంది. మరోవైపు ఉజ్బెకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంలోని ఓడరేవులను అనుసంధానించే ట్రాన్స్-అఫ్ఘన్ రైల్వే ఆలోచనలు కూడా కొంతకాలంగా చర్చలో ఉన్నాయి. ఉత్తర యూరేషియా నుంచి దక్షిణాసియా ఓడరేవుల వరకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు ఇప్పటికే ఉన్నాయి.

**భద్రతే అసలు సవాలు**

అయితే ఈ ప్రతిపాదనకు అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా రైల్వే కారిడార్ నిర్మాణానికి భద్రత ప్రధాన సమస్యగా మారవచ్చు. ఆయా దేశాల మధ్య రాజకీయ సంబంధాలు, సరిహద్దు పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, రైల్వే గేజ్‌ల మధ్య తేడాలు, భారీ పెట్టుబడులు వంటి అంశాలు కూడా ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేస్తాయి. అదే సమయంలో రష్యాకు ఇది కేవలం వాణిజ్య మార్గం మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పెట్టుబడులను పెంచే అవకాశంగా కూడా కనిపిస్తోంది. దేశీయ నిర్మాణ రంగానికి ఏటా అదనంగా సుమారు ఒక ట్రిలియన్ రూబుళ్ల విలువైన పనులను సద్వినియోగం చేసుకునే సామర్థ్యం ఉందని ఖుస్నుల్లిన్ పేర్కొన్నట్లు నివేదికలు తెలిపాయి.

**భారత్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం**

రష్యా ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే భారత్‌కు కూడా వ్యూహాత్మకంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. యూరేషియా నుంచి భారత్‌కు సరకు రవాణా కోసం సముద్ర మార్గాలతో పాటు ప్రత్యామ్నాయ భూ-సముద్ర మార్గం అందుబాటులోకి వస్తుంది. సరఫరా వ్యవస్థలో అంతరాయాలను తగ్గించుకోవడం, రవాణా మార్గాలను విభిన్నీకరించడం, రష్యా-భారత్ వాణిజ్యాన్ని పెంచడం వంటి అంశాల్లో ఇది ఉపయోగపడవచ్చు. అయితే ప్రస్తుతానికి ఇది రష్యా ప్రభుత్వం పరిశీలనకు ప్రతిపాదించిన ఆలోచన మాత్రమే. ఏ మార్గాన్ని ఎంచుకోవాలి, భారత్‌కు సరకు ఎలా చేరాలి, ఏ దేశాల మీదుగా కారిడార్ నిర్మించాలి, ఎంత పెట్టుబడి అవసరం, భద్రతా ఏర్పాట్లు ఎలా ఉండాలి వంటి అంశాలపై సమగ్ర సాధ్యాసాధ్యాల అధ్యయనం జరగాల్సి ఉంది. ఆ తర్వాతే ఈ ప్రతిపాదన వాస్తవ ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంటుంది. హార్ముజ్, బోస్ఫరస్ వంటి వ్యూహాత్మక జలసంధులపై ప్రపంచ వాణిజ్యం ఎంతగా ఆధారపడి ఉందో ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో.. రష్యా తాజా ప్రతిపాదన యూరేషియా రవాణా పటంలో భవిష్యత్తులో కీలక మార్పులకు నాంది పలుకుతుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హిందూ పండుగలపై వివక్ష ఎందుకు?

**హైదరాబాద్, మహా :** పాతబస్తీ బోనాల ఉత్సవాల వేదికగా తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూ సమాజం, దేవాలయాల పట్ల ఆ రెండు పార్టీలు కేవలం ఓటుబ్యాంకు, సంతుష్టీకరణ రాజకీయాలకే పరిమితమయ్యాయని ఆయన ధ్వజమెత్తారు. హిందువుల పక్షాన, వారి సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తితే తనపై ఉద్దేశపూర్వకంగా మతతత్వవాది అనే ముద్ర వేస్తున్నారని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**నిధుల కేటాయింపుల్లో పక్షపాతం.**

బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వాలు, నిర్వహణలో మాత్రం పూర్తిగా విఫలమయ్యాయని బండి సంజయ్ ఆరోపించారు. పండుగకు కేవలం నామమాత్రపు నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. రాజధాని నగరంలో వేలాది ఆలయాలు ఉన్నప్పటికీ, వాటి అభివృద్ధికి, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా విదల్చడం లేదన్నారు. రంజాన్ మాసంలో ఇచ్చే నిధులతో పోలిస్తే హిందూ పండుగల పట్ల ప్రభుత్వాలు ఎంతగా వివక్ష చూపుతున్నాయో స్పష్టమవుతోందని ఆయన మండిపడ్డారు.

**కేటీఆర్‌కు అప్పడే జ్ఞానోదయం అయింది!**

లాల్‌దర్వాజ బోనాల సాక్షిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరుపై బండి సంజయ్ తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో తాను చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నప్పుడు కేటీఆర్ నానా యాగీ చేశారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అదే కేటీఆర్ అమ్మవారి దర్శనం కోసం రావడం చూస్తుంటే.. భాగ్యలక్ష్మి అమ్మవారి కృపతోనే ఆయనకు పూర్తి స్థాయిలో జ్ఞానోదయం కలిగినట్లుందని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ సైతం లాల్‌దర్వాజ ఆలయ అభివృద్ధికి రూ. 20 కోట్లు కేటాయిస్తామని గొప్పలు చెప్పి, ఆ హామీని గాలికొదిలేశారని విమర్శించారు.

**భాగ్యలక్ష్మి గుడి.. స్వర్ణ దేవాలయం.**

రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేసిన బండి సంజయ్.. తమ ప్రభుత్వం ఏర్పడితే పాతబస్తీలో బోనాల ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. చార్మినార్ వద్ద కొలువై ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం) తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. పాతబస్తీలో నివసించే హిందువులు సైతం ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని, అలాంటప్పుడు ఆ ఆదాయంతో ఇక్కడి ఆలయాలను అభివృద్ధి చేస్తే తప్పేమిటని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

**ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వంచన.**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. హైడ్రాలో కేవలం 150 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే, వేలాది మంది యువత ఫిజికల్ టెస్టుకు బారులు తీరడమే రాష్ట్రంలో ఉన్న తీవ్రమైన నిరుద్యోగ సమస్యకు నిలువుటద్దమని విశ్లేషించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధాప్య పింఛన్ల పెంపు తదితర ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మరోవైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని, తక్షణమే ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళాల ద్వారా ఇప్పటికే లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించామని బండి సంజయ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**యువతలో చైతన్యం రావాలి.**

సనాతన ధర్మ పరిరక్షణ కోసం తన తుది శ్వాస వరకు పోరాడుతూనే ఉంటానని బండి సంజయ్ స్పష్టం చేశారు. నేటి యువత మాదకద్రవ్యాలకు, సంఘవిద్రోహక శక్తులకు దూరంగా ఉంటూ నవభారత నిర్మాణంలో కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ వైఖరిని తూర్పారబట్టిన ఆయన.. టిప్పు సుల్తాన్, అయోధ్య రామమందిరం లాంటి సున్నితమైన అంశాల్లో ఆ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చడం లేదో కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పాలన్నారు.

# ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును వ్యతిరేకిస్తాం

- **ప్రజాస్వామ్యంలో ఎవరి చేతులూ కట్టేయలేం**
- **డీలిమిటేషన్‌పై విపక్షాల నిర్ణయానికే కట్టుబడి ఉంటాం**
- **పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే**



**రుద్రపుర్, మహా :** విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును పార్లమెంట్‌లో కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. సోమవారం జరగనున్న విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశంలో బిల్లుపై చర్చించి తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. ఉత్తరాఖండ్ పర్యటనలో ఉన్న ఖర్గే రుద్రపుర్‌లో వార్తా సంస్థ ఏఎన్ఐతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై తమ వైఖరి ఇప్పటికే స్పష్టంగా ఉందని ఖర్గే అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరి చేతులనూ కట్టివేయలేమని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ అంశంపైనా ఆయన స్పందిస్తూ.. తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉన్నప్పటికీ విపక్ష కూటమిలోని అన్ని పార్టీలతో చర్చించి తీసుకునే ఉమ్మడి నిర్ణయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందని చెప్పారు. ప్రస్తుత ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు విదేశీ విరాళాలు పొందుతున్న సంస్థల ధ్రువపత్రం రద్దు లేదా ముగిసిన సందర్భంలో వాటి ఆస్తులు, విదేశీ నిధుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోంది. బిల్లు 2026 మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టగా ప్రస్తుతం సభలో పెండింగ్‌లో ఉంది.

**'కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే పర్యటన'**

ఉత్తరాఖండ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడమే తన పర్యటన ప్రధాన ఉద్దేశమని ఖర్గే తెలిపారు. తాను ఏఐసీసీ అధ్యక్షుడిగా ప్రతిరోజూ ప్రతి రాష్ట్రానికి వెళ్లలేనని, అయితే పార్టీకి అవసరమైన సమయంలో, అవసరమైన ప్రాంతాల్లో పర్యటిస్తానని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

**అయోధ్య విరాళాలపై మోదీ సమాధానం చెప్పాలి**

అయోధ్య రామమందిరానికి సంబంధించిన విరాళాలు, ఆస్తుల దుర్వినియోగంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఏర్పాటు నుంచి ఆలయానికి సంబంధించిన పలు కార్యక్రమాల వరకు ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి సంబంధించిన విరాళాలు, ఆస్తుల వ్యవహారంపై పార్లమెంట్‌లో సమాధానం చెప్పాల్సిన బాధ్యత మోదీపై ఉందని అన్నారు.

**రాహుల్ కార్యక్రమానికి ప్రశంసలు**

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమాన్ని ఖర్గే ప్రశంసించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, డిమాండ్లను తెలుసుకోవడం ద్వారా వారికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

**విపక్షాల ఉమ్మడి వ్యూహం**

ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై కాంగ్రెస్‌తో పాటు పలు విపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బిల్లును ఉపసంహరించుకోవాలని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కోరగా, ఎన్‌సీపీ (ఎస్పీ) కూడా వ్యతిరేకత వ్యక్తం చేసింది. కాంగ్రెస్ నేతలు కూడా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశంలో ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది.

# సీనియర్ సిటిజన్లే సైబర్ కేటుగాళ్ల టార్గెట్

- **19 నెలల్లో రూ.102.02 కోట్లు హాంఫట్.**
- **డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, ఓటీపీ, డేటింగ్ మోసాలతో వృద్ధులకు వల.**
- **అప్రమత్తంగా ఉండాలన్న సీపీ సజ్జనార్**

**హైదరాబాద్, మహా :** సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. 2025 జనవరి నుంచి 2026 జూలై 31 వరకు 19 నెలల వ్యవధిలో సీనియర్ సిటిజన్లకు సంబంధించి 403 సైబర్ కేసులు నమోదయ్యాయని, ఈ మోసాల్లో బాధితులు ఏకంగా రూ.102.02 కోట్లు నష్టపోయారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. వృద్ధుల ఒంటరితనం, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహనను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు భారీగా డబ్బులు కొల్లగొడుతున్నారని వివరించారు. ఈ 19 నెలల్లో ట్రేడింగ్ మోసాల్లో 113 కేసులు నమోదయ్యాయని, బాధితులు రూ.55.88 కోట్లు నష్టపోయారని సజ్జనార్ తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, భారీ లాభాలు, పెట్టుబడుల పేరుతో ముందుగా పరిచయం పెంచుకుని ఆ తర్వాత నకిలీ యాప్‌ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. యాప్‌లో భారీ లాభాలు వచ్చినట్లు చూపించి మరింత పెట్టుబడి పెట్టేలా చేసి చివరకు మొత్తం సొమ్మును కాజేస్తున్నారని వివరించారు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.31.93 కోట్లు**

పోలీసులు, సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి బెదిరించడం ద్వారా డబ్బులు వసూలు చేస్తున్న డిజిటల్ అరెస్ట్ మోసాల్లో 69 కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు. ఈ తరహా మోసాల్లో సీనియర్ సిటిజన్లు రూ.31.93 కోట్లు కోల్పోయారని వెల్లడించారు. కేసులు, అరెస్టులు, మనీలాండరింగ్ వంటి అంశాల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి బాధితుల నుంచి భారీ మొత్తాలను బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు.

ఓటీపీ మోసాలకు సంబంధించి 115 కేసులు నమోదయ్యాయని, వీటిలో రూ.4.94 కోట్లు నష్టపోయినట్లు తెలిపారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, పెట్టుబడులపై భారీ రాబడుల పేరుతో సాగుతున్న ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లలో 22 కేసులు నమోదయ్యాయని, బాధితులు రూ.2.79 కోట్లు నష్టపోయారని వివరించారు.

**డేటింగ్ యాప్స్‌తోనూ వల**

సీనియర్ సిటిజన్ల ఒంటరితనాన్ని కూడా సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయం పెంచుకుని గిఫ్టులు, కస్టమ్స్ డ్యూటీ, అత్యవసర ఖర్చుల పేరుతో డబ్బులు అడుగుతున్నారని చెప్పారు. డేటింగ్ ఫ్రాడ్, హనీట్రాప్ కేసుల్లో 7 కేసులు నమోదై, రూ.70.11 లక్షలకు పైగా బాధితులు నష్టపోయారని వెల్లడించారు. పరువు పోతుందనే భయంతో కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని పేర్కొన్నారు.

**ఫిర్యాదు అందగానే ఖాతాలు ఫ్రీజ్**

2025లో సీనియర్ సిటిజన్లకు సంబంధించిన 285 సైబర్ కేసుల్లో రూ.71.81 కోట్లు, 2026 తొలి ఏడు నెలల్లో నమోదైన 118 కేసుల్లో రూ.30.20 కోట్లు నష్టపోయినట్లు సజ్జనార్ తెలిపారు. అయితే పోలీసుల అవగాహన కార్యక్రమాలతో నెలవారీ కేసుల సంఖ్య 24 నుంచి 17కు తగ్గిందని చెప్పారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి, సొమ్ము రికవరీకి వేగంగా చర్యలు తీసుకుంటున్నామని సీపీ వివరించారు

# హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?

( మొదటి పేజీ తరువాయి )



40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందన్న అంచనాలు చర్చకు దారితీశాయి. అయితే తుది ముసాయిదా జాబితా వెలువడిన తర్వాతే అసలు సంఖ్యపై స్పష్టత రానుంది. ఆదివారం సాయంత్రం వరకు నమోదైన వివరాల ప్రకారం ఈ మూడు జిల్లాల పరిధిలోని 28 నియోజకవర్గాల్లో కలిపి సుమారు 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ, పరిశీలన పూర్తయిన నేపథ్యంలో భారీ సంఖ్యలో పేర్లు తొలగిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఆదివారం, సోమవారం ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ బీఎల్‌వోలు, ఉన్నతాధికారులు విధులకు హాజరై ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు.

**17న ముసాయిదా జాబితా**

ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని అర్హులైన ఓటర్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు అందించాలని అధికారులు సూచించారు. మరోవైపు ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ జాబితా విడుదలైన తర్వాత తొలగింపులు, చేర్పులు, అభ్యంతరాలు, సవరణలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం రానున్న రెండు రోజుల్లో ఓటర్ల సంఖ్యలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. బోనాల పండుగ నేపథ్యంలో ఫారాల సమర్పణలో భారీగా హెచ్చుతగ్గులు ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో దాదాపు సగం ఓట్లకు కోత?**

రాజధాని పరిధిలోని నియోజకవర్గాల్లో సనత్‌నగర్ పరిస్థితి ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారింది. అక్కడ ప్రస్తుతం 2,54,030 మంది ఓటర్లు ఉండగా.. సుమారు 1.16 లక్షల ఓట్లు, అంటే 45.68 శాతం వరకు తొలగిపోయే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో మలక్‌పేట్‌లో 33.92 శాతం, సనత్‌నగర్‌లో 45.68, ముషీరాబాద్‌లో 39.77, జూబ్లీహిల్స్‌లో 44.21, అంబర్‌పేట్‌లో 36.17, గోషామహల్‌లో 39.38, ఖైరతాబాద్‌లో 36.78, సికింద్రాబాద్‌లో 38.47 శాతం వరకు ఓట్లు తొలగిపోయే అవకాశం ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. కార్వాన్‌లో 33.23, చార్మినార్‌లో 32.49, నాంపల్లిలో 31.33, బహదూర్‌పురలో 22.38, కంటోన్మెంట్‌లో 35.31, యాకుత్‌పురలో 31.40, చాంద్రాయణగుట్టలో 32.57 శాతం వరకు కోత పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**శివారు నియోజకవర్గాల్లోనూ భారీగా..**

రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇబ్రహీంపట్నంలో 21.43, ఎల్‌బీనగర్‌లో 42.19, మహేశ్వరంలో 40.03, రాజేంద్రనగర్‌లో 38.14, శేరిలింగంపల్లిలో 36.60 శాతం వరకు ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని అంచనా. చేవెళ్లలో 19.31, కల్వకుర్తిలో 11.65, షాద్‌నగర్‌లో 14.56 శాతం వరకు కోత పడే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక గణాంకాలు సూచిస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్‌లో 29.30, మల్కాజిగిరిలో 37.30, కుత్బుల్లాపూర్‌లో 35.99, కూకట్‌పల్లిలో 32.81, ఉప్పల్‌లో 40.05 శాతం వరకు ఓట్లు తొలగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే క్యూర్ పరిధిలోని చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించిన గణాంకాలను పరిగణనలోకి తీసుకునే విషయంలో తుది లెక్కల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది.

**నగరంలో డూప్లికేట్ ఓట్లే కారణమా?**

హైదరాబాద్‌కు నిత్యం వేలాది మంది ఉపాధి, విద్య, వ్యాపారం కోసం వలస వస్తుంటారు. కొంతకాలానికి నగరంలో స్థిరపడిన వారు ఇక్కడ కూడా ఓటరు గుర్తింపు పొందుతుంటారు. అదే సమయంలో సొంత గ్రామాల్లోనూ ఓటు కొనసాగించే సందర్భాలు ఉండటంతో డూప్లికేట్ ఓట్ల సమస్య ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్న వారు తమ సొంత ప్రాంతంలోని ఓటును కొనసాగించేందుకు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్, శివారు నియోజకవర్గాల్లో కొందరు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించకపోవడం కూడా ఓట్ల తగ్గుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అయితే ఫారాలు అందకపోవడమే ఓటు తుది తొలగింపునకు సమానం కాదు. ముసాయిదా జాబితా, అభ్యంతరాలు, సవరణల ప్రక్రియ పూర్తయిన తర్వాతే తుది ఓటర్ల సంఖ్యపై స్పష్టత రానుంది. కొన్ని ప్రాంతాల్లో అధికారుల స్థాయిలో జరిగిన లోపాలపై కూడా పరిశీలన అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీలు, ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# 'మోదీ ఒక శక్తి'.. ఆయనను ఎవరూ ఏమీ చేయలేరు

- **గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.**

**హైదరాబాద్, మహా.:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధారణ వ్యక్తి కాదని.. ఆయన ఒక గొప్ప శక్తి అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మోదీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు ఎన్ని కుట్రలు చేసినా ఆయనను ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజాసింగ్ మాట్లాడారు. బోనాల సందర్భంగా మహిళలు, హిందూ సమాజం, దేశ శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థించడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ కోసం కూడా ప్రార్థించాలని రాజాసింగ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మోదీ చేస్తున్న కృషికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశం అనేక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని రాజాసింగ్ పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత బలోపేతమవుతోందని అన్నారు. ప్రధాని ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అలాంటి కుట్రలు మోదీని ఏమాత్రం ప్రభావితం చేయలేవని వ్యాఖ్యానించారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని రాజాసింగ్ పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 10-08-2026
సాహిత్యం నిర్వహణ హనీఫ్ 04

## అమలిన ప్రేమలు!

నా కళ్ళముందే
ఏ పరిచయమూ లేని
ఏ బంధుత్వమూ లేని
సీతాకోక చిలుకొకటి
పొద్దున్నే పువ్వు మీద వాలింది
పువ్వు ఏగాదిగా చూడలే
మనలాగా భ్రుకిటి ముడవలే
అనుమానపడలే
వర్ణ బేధం పట్టించుకోలే
ఆ సీతాకోకచిలుక
అనుకోని అతిథి
పువ్వును ప్రవేశ అనుమతి అడగలే
కనీసం ఓ దొంగ నమస్కారం పెట్టలే
నిశ్శబ్దంగా పువ్వు పై వాలిందో లేదో
పువ్వు పులకించిపోయింది
ఒళ్ళు తెలియని తనంతో ఊయలలూగింది
ఏమీ ఆశించని ఆతిథ్యంతో
సీతాకోకచిలుకకొకింత మధురిమ
ఆ సుందర పుష్పానికి ఒకింత
అనిర్వచనీయమైన అనుభూతి
ఆ పూల చెట్టును పెంచిన మనిషిగా
ఎందుకో నాకు కొంచెం సిగ్గేసింది
కొన్ని క్షణాలే ఆ దృశ్యం
నాకో కొత్త జీవన పాఠం నేర్పింది!
సహజ ప్రేమలు ఎప్పుడూ
అమలినమైనవే ఆనందకరమైనవే!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261.

## ఓ సముద్రమా..!

గంభీరంగా గర్జిస్తూ ఉరకలు వేసే నిన్ను,
పిల్లలు,పెద్దలూ చిందులు వేస్తూ నీ వెంట పరుగెడతారు.
అలుపెరగని అలవై నీవు తీరం చేరతావు.,
ఆకాశాన్ని చుంబించే లా దూరం లో కనిపిస్తావు!
నీ కడుపులో కలిపేసుకున్న నదులు పదులలో...
నీ గుండెల్లో దాచుకున్న ముత్యాలు లక్షల్లో!
ప్రేమ పంచితే జోల పాడే నీవు.,
కోపమొస్తే ప్రళయమే సృష్టిస్తావు!
నీ హోరులో ఒక లాలీ ఉంది.,
నీ మౌనం లో ఒక తుఫాను ఉంది!
ఓడిన ప్రతిసారి నీ వద్దకు చేరడం.,
మళ్ళీ గెలిచానని వెనుదిరిగి వెళ్లడం
నీ వద్దే నేర్చాను!
ఆది అంతమూ లేని నీ ఆటలో..,
ఒక చిన్న ఇసుక రేణువును నే నౌతా!
నీ ఒడ్డున కూర్చుంటే చాలు మనసు బరువు
వెన్నలా కరుగుతుంది.
తనువు ఈ జ్ఞాపకాలను వదల లేక...
విధులు కొరకై వెళ్తున్నా...
వదల లేక, ఉండలేక, మళ్ళీ కలుద్దాం..!
సముద్రమా...!

మూర్తి.

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad.
Telangana- 500034.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

# "అర్రాసు" లో తెలంగాణ భాషా సౌందర్యం

తెలంగాణ మాండలికంలో కథలు రాయడం తొలితరం తెలంగాణ కథకులతో ప్రారంభమై, ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంది."ఆంధ్ర ప్రభ" లో ఉప్పల నరసింహం," ఉదయం" లో తెలిదేవర భానుమూర్తిలతో రెగ్యులర్ గా తెలంగాణ మాండలికంలో ఫీచర్లు రాయించడం ప్రారంభమైంది. అప్పటినుండి వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినంత మంది మాత్రమే మాండలిక ఫీచర్లు రాయగలిగారు. మళ్లీ ఇన్నాళ్లకు తెలంగాణ మాండలికంలో కథలు, ఫీచర్ రాతలు రాసిన వారిలో రాజీ కన్నా కనిపించడం," అర్రాసు" పేరుతో వారు పుస్తకం తీసుకురావడం అభినందించదగ్గ విషయం అప్పటి గ్రామీణ జీవితాన్ని, గ్రామంలో దళితుల పరిస్థితిని, గ్రామ జీవితంలో ,మనుషుల మనస్తత్వాలలో కాలంతో పాటు వస్తున్న మార్పులను ఈ "అర్రాసు" లో ఉన్న కథలు చిత్రించగలిగాయి.

ఒకప్పుడు వానలు పడితేనే పంటలు పండేవి. జొన్నలు, మొక్కజొన్నలు తప్ప మిరప, పత్తి అస్సలు లేకుండే. ప్రాజెక్టులు, కాలువలు, పొద్దంతా కరెంటు ఉండటంతో భూములున్నోళ్ళు తీరొక్క పంట పండిస్తున్నారు. కాలం మారుతుంది. కాలంతోటి అన్నీ మారుతున్నాయి. కాపోల్లు అన్నాలు తినవోయినప్పుడు కూలికి వచ్చిన శెంకరిగాడు, మిరపకాయలు దొంగిలించాడని వాళ్ళు లొల్లి పెడితే, మల్లయ్య పటేల్ వచ్చి న్యాయంగా ఈ కేసును ఎలా పరిష్కరించారో" రాటిబాయి" కథలో చూడవచ్చు. గొడ్లను కాసే కుర్రాడికి తుంట గట్టిన గొడ్డు అంటే అభిమానం. అది కోతకు పోతుందంటే వాడు పడే బాధ, విచారం "పూలుగు" లో కనబడుతుంది. "అర్రాసు" కథలో శంకరయ్య, మల్లవల కొడుకు బాపుకు మేనపిల్ల పోసవ్వనిచ్చి పెళ్లి చేస్తారు. పోసవ్వతో నానా చాకిరి చేయించుకుంటూ, మల్లవ్వ అనేక బాధలు పెడుతూ ఉంటుంది.ఒకసారి కోపంతో సర్వతో కోడలి వీపు మీద బాదగా, ఆ దెబ్బకు పోసవ్వ చచ్చిపోతుంది.దాంతో భయపడిన శంకరయ్య, మల్లవ్వలు ఆ శవాన్ని బండిలో వేసుకొని పోయి ఏటిలో పడేస్తారు. బిడ్డను చూడటానికి వచ్చిన పోసవ్వ తల్లిదండ్రులతో, మీ ఇంటికే పోతానంటే పంపించామని నమ్మ బలుకుతారు. ఏటిలో శవం బయటపడటంతో, పంచాయితీ జరపగా నిజం బయటపడుతుంది. కోడల్ని చంపినందుకు ఊర్లో పంచాయితీ పెట్టి' మల్లవ్వను అర్రాసు పెడుతున్న. ఎవరన్నా కొనుక్కోండ్రి' అని కరణం ప్రకటిస్తాడు. ఎవరూ ముందుకు రాకపోతే పెద్ద మాదిగోన్ని పిలిచి, ఒక కొత్త (పైసా) కు కొనుక్కోమని బెదిరించగా, వాడు ఆ కొత్తను శంకరయ్య చేతిలో పెట్టి మల్లవ్వను తీసుకెళ్తాడు. 'శంకరయ్యకు పెళ్ళాం కావాలంటే వాని భూములు, జాగలు, సొమ్ములు సంబంధాలు, ధనం తెచ్చి నీ చేతుల పోసి తీసుకొని పోవాల. ఆడు రాకుంటే దీనితోనే నీవు ఇంటి పని జేపిచ్చుకో' అని తీర్పునిస్తారు ఆ తీర్పు ప్రకారమే శంకరయ్య తన ఆస్తినిచ్చి భార్యను విడిపించుకుంటాడు.

పటేల్ దగ్గర " జీతగాడు" గా ఉన్న సొంగు, వెట్టి చాకిరి చేస్తూ తన పొలం అనుకొని పనిచేస్తుంటాడు. సలిజొరం వచ్చి 15 రోజులు పోకపోతే నానా మాటలు అని, నీ పెళ్ళాన్ని పంపించు అన్నందుకు తిరగబడతాడు. దాంతో గూడెంల పంచాయితీ పెట్టించి పటేల్, చెప్పుతో కొట్టడం భరించలేక అడవిలోకి పోతాడు. అక్కడ అన్నలు కలిసి అంతా తెలుసుకుంటారు. కొద్ది రోజులకే పటేల్ కాళ్లు విరగడం, సుంగం కుటుంబం గూడెం వదిలిపోవడం జరుగుతుంది." అగ్గిపుల్ల దారిలో" క్రూరంగా, నిరంకుశంగా ప్రవర్తించే ఆ ఊరి కరణం కొడుకులు. వారి తొత్తుగా పనిచేసే బుచ్చడి దుర్మార్గాలకు అంతులేకుండా పోతుంది. వీరు బూదక్క గుడిసె మీద దాడి చేసి అందర్నీ కట్టిపడేసి, ఆమె కోడలును బలాత్కారం చేయగా, ఆమె అవమానం భరించలేక బావిలో పడి ఆత్మహత్య చేసుకుంటుంది. అందరూ తిని తాగి బోనాల పండుగ చేసుకుంటున్నా రోజు, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కరణం కొడుకులను, బుచ్చడ్ని, పక్క ఊరి కరణంను కూడా నరికి చంపేస్తారు. ఆడ మొదలైన ఎరుపు అగ్గిమంట ఎన్నో ఊర్లకు పాకింది. ఎంతోమంది దొరలను గడీల నుంచి తరిమింది ఆ ఎర్రెర్రని అగ్గి అని చెబుతూ కథ ముగుస్తుంది. హాస్టల్ కుర్రాడు సంకురాత్రి సెలవుల్లో ఊరికిపోయినప్పుడు, తల్లి వెంబడి కూలి పనులకు పోతాడు. వాటి తాలూకు 100 రూపాయల నోటు కొడుకుకిచ్చి, ఏమన్నా కొనుక్కోమని తల్లి చెబుతుంది.




కొడుకు హాస్టల్కు వచ్చి దాన్ని భద్రంగా పెట్టేలో పెట్టుకుని చూసుకుంటూ మురిసిపోతుంటాడు. దాన్ని ఎవరైనా ఎత్తుకుపోతారేమోనని జేబులో పెట్టుకొని తిరుగుతుంటే, ఒకసారి అది కింద పడితే తీసుకొని జేబులో పెట్టుకోవడం పిటి సార్ చూస్తాడు. అదెక్కడిది, ఎక్కడినుండి దొంగతనం చేశావని చితకబాదుతాడు. ఎవరివైనా డబ్బులు పోయాయా అని పిల్లల్ని అడుగుతుంటాడు. సార్ కొట్టిన దెబ్బల కంటే, హీనంగా తిట్టిన తిట్లకే ఏడుపు ఆపుకోలేక పోతాడు. ఇది "వంద నోటు తెచ్చిన అవమానం."దళితుల జీవితాలను, దళితులపై చూపే వివక్ష అణిచివేతలను, అప్పట్లో ఊళ్ళలో వారిపై కొనసాగి పెత్తందారుల అవమానాలు అఘాయిత్యాలను ఈ కథలు తెలియజేస్తాయి. వారికి బుద్ధి చెప్పిన అన్నలు, వారి ప్రమేయంతో వీరి జీవితాలు బాగుపడడం ఇవన్నీ ఈ కథలలో కనిపిస్తాయి.

ఇక " రాజవ్వ చెప్పిన ముచ్చట్లు" లో వాళ్ళ ఊరు, ఊరి విశేషాలు ,అక్కడి మనుషులు, వాళ్ళంతా జరుపుకునే పండుగలు వీటన్నింటిని తన అనుభవాలు, జ్ఞాపకాలనుండి వెలికి తీసిన అక్షర రూపమే ఈ వ్యాసాలు. "ఈ మధ్యన మా అవ్వ గారి ఊరు, అమ్మమ్మ వాళ్ళ "ఊరు గుర్తొస్తోంది". కానీ పోబుద్ధి అయితలేదు. ఇంకా అక్కడేం మిగిలింది. ఈ పట్టణంలో ఏముందో ఆడ కూడా అదే మోపయింది. అసలు ఒక్కరు కూడా ఇంట్లో కెళ్ళి బయటకు వస్తలేరు. టీవీలు చూసుకుంటూ ఉన్నారు. ఇంటి ముందరకు అమ్మేటోళ్లు రకరకాలుగా వచ్చేవారు. అవన్నీ విడిచేసి జనాలు పట్నం బోవుడు షురూ చేసినారు" అని ఊరిని జ్ఞాపకం చేసుకుంటారు. ఒక రోజంతా ముసురు పెట్టంగనె వెదర్ మస్తుంది అని మురిసిపోతారు. అందరూ ఇంట్లోనే కూర్చొని వెచ్చగా టిఫిన్లు చేసుకొని తినడం, వడగండ్ల వానలు పడితే ఆ మంచు ముద్దలను ఏరుకొని తెచ్చుకోవడం, చింతచెట్లు, అల్లనేరేడు చెట్లనుండి రాలిన పండ్లను తెచ్చుకోవడానికి పిల్లలు పోటీలు పడేవాళ్లు అని "ఆన ముచ్చట్ల" గురించి తెలియజేస్తారు. బడులు మొదలు కావడం, పొలాల పనులు మొదలుకావడం ఒకేసారి అయితుండె. ఎవరి పొలంలో నాట్లు వేయాలో ఒకరోజు ముందరే అనుకొని, పొద్దుగాల కరెక్టు టైం కు గ్రూప్ గా వచ్చి పనులకు దిగుతారు. వాళ్లు ఎకరానికి ఇంత అని ఇస్తరు. ఆ పైసలు అందరూ పంచుకుంటారని "నాట్ల ముచ్చట" గురించి చెబుతారు. చినుకులు పడటం ప్రారంభం కాగానే "ఇళ్ళకప్పుడు" కార్యక్రమం పెట్టుకుంటారు. కలప బొంగులు, పంజగడ్డి కట్టలు అన్నీ ముందే రెడీ చేసుకుంటారు. ఇళ్ళ కప్పుడు ఒకరిద్దరితోని అయ్యే పని కాదు. చుట్టుపక్కలోళ్ళను ఇద్దరు ముగ్గురిని, ఇద్దరు ముగ్గురు కూలోళ్ళను పెట్టుకొని పని చేయించుకుంటారు. మంచిగా పనితనం తెలిసిన వాళ్ళనే పిలిపిస్తారు. రోజులు మారినాయి. చాలా మార్పు వచ్చింది. ఇళ్ళకప్పడం అంటే ఇప్పుడు ఎవరికీ తెలియదు. చలికాలం అంతా ఏదో కొత్త లోకంలో ఉన్నట్లు ఉంటుంది. రాత్రి ఎక్కువ కావడం, చలి ఎక్కువగా ఉండటంతో వెచ్చగా ఎక్కువసేపు పండుకోవడం, చలి మంటలు వేసుకోవడం, చలికాలంలో వచ్చే పండ్లు కూరగాయల గురించి, పెదాలు పగలకుండా ముఖానికి వాజిలైన్ రాసుకోవడం లాంటి "సలికాలం ముచ్చట్లు" గురించి చెబుతారు. కరెంటు లేని కాలంలో ఊళ్ళో "గాంచునూనె( కిరోసిన్) దీపాలు" ఉంటుండే. కరెంటు వచ్చిన తర్వాత చాలామంది వైర్లకు కొక్కేలు వేసి, దొంగ కరెంటు తీసుకునేవాళ్లు. అప్పట్లో రేషన్ షాపుల నుండి గాంచునూనె తెచ్చుకునేవారు.

పిల్లలకు చాక్లెట్ ఆశ చూపించి దొంగలు ఎత్తుకుపోతున్నారు. జాగ్రత్తగా ఉండండి అని టీచర్ చెబితే, అదే మనసుల పడి చీకట్లో చెట్ల నీడలు చూసి, దొంగలనుకొని భయపడిన అమ్మాయే "పిరికిపిత్తుల నేను". చిన్నప్పుడు గడ్డిమీద, మొక్కల మీద వాలే "బూగల"ని (తూనీగలు) పట్టుకొని ఆడుకోవడం పిల్లలకు ఒక సరదా. స్కూల్లలో రాసుకోవడానికి "పెన్నులు" కొనడం, రిఫిల్ అయిపోతే వేయించుకోవడం. తర్వాత రెండు దిక్కుల పెన్నులు వచ్చినయ్. తర్వాత నాలుగు దిక్కుల నాలుగు రంగుల రిఫిల్ పెట్టుకునే పెన్నులు వచ్చాయి. రెనాల్ట్ వచ్చిన తర్వాత అది ఖరీదైనప్పటికీ, బాగా రాస్తుండడంతో అందరు దాని వెనుక పడ్డారు. బర్రె ఈనిందంటే "జున్ను" పాలు తాగుతామని సంబరం. గడ్డలెక్కుండే జున్నును చక్కెరలో అద్దుకొని తింటే అమృతంలా ఉండేది. వ్యవసాయదారులకు పశువులంటే సొంత సంతానం మాదిరి. వాళ్ళ "కర్రెద్దు" చనిపోతే, కొడుకు పోతే ఎంత దుక్క పడతారో అంతగా దుఃఖం. నాయనకే కాదు అమ్మకు కూడా. చార్మినార్ దగ్గర ఉన్న "నయాబ్ హోటల్" బాగుంటుందని విని పోతే, అక్కడ కాలు పెట్టే జాగలేనంత జనాలు. దాంతో అది విడిచి పక్కనున్న షాదాబ్ హోటల్ కు పోయి తిని, చార్మినార్ చూడడానికి పోతారు. మక్కా మసీదు చూడటానికి పోతే, హిజాబ్ లేదని లోపలికి పంపించరు. దాంతో తిరుగుముఖం పడతారు.

"పుష్కలయ్య" అనే దేవుని పేరు మీద ఉన్న గుట్టకు మొక్కితే వానలు పడతాయని అక్కడి వాళ్లకు చాలా నమ్మకం. అలా జరిగిందట కూడా. శ్రావణంలో వాళ్ళ వైపు "రాయేసుని జోగి" ఎత్తుతారు. ఆ బిచ్చంతో పూజా సామాను తీసుకొచ్చి పూజ చేసి పలారాలు పంచి ఒక్క పొద్దు ఇడుస్తారు. ఇదంతా నిష్టగా చేస్తారు. రాయేసుడు అంటే వేములవాడ రాజన్న. దసరా పండుగను పిండి వంటలు, కొత్త బట్టలతో ఎంత వేడుకగా చేసుకుంటారో, సెలవులతో పిల్లల సంబరం ఎలా ఉంటుందో, తిని తాగే పండుగని ఎంత సంబురంగా చేసుకుంటారో" దసరా ముచ్చట" లో చెబుతారు. అలాగే "దీపావళి" పండుగను ఎంత సంబరంగా చేసుకునేవారో అలాంటి విశేషాలను కూడా తెలియజేస్తారు. "శివరాత్రి"కి ఉపవాసం ఉండి సాయంత్రం గుడికి పోయి రావడం, పలారాలు తయారు చేసి అందరికీ పంచడం ఉండేది. ఉతికిన పక్క బట్టలతో కిందనే పడుకోవాలి. పొద్దున్నే చీకటాల లేసి తయారై ,వంట వండుకొని ఒక పొద్దు ఇడుస్తారు అని శివరాత్రి విశేషాలను తెలియజేస్తారు. కొత్తకొత్త ముగ్గులు నేర్చుకొని కొత్త సంవత్సరం రోజున వెయ్యాలని ఆడపిల్లలు. పిల్లలు పరిగె ఏరుకొనుడు, రాలిన గోల్కలు సేకరించడం, పెద్ద పిల్లలైతే ఏదన్నా పనికి పోయి పైసలు తెచ్చుకుంటే థర్టీఫస్ట్ దావతో, గ్రీటింగ్ కార్డులకో పనికొచ్చేది. ఆరోజు స్కూల్లో సార్లు ఏమనకపోయేది. నోట్ బుక్ పేజీలు చింపి దానిమీద హ్యాపీ న్యూ ఇయర్ అని రాసి క్లాస్మేట్లకు, చిన్న ప్రింటింగ్ కార్డులు కొని సార్లకు ఇచ్చుడు లాంటి "కొత్త సంవత్సరపు ముచ్చట్లు" ను ఆసక్తిగా తెలియజేశారు.

వ్యాపారస్తులు గిరాకీ పెంచుకోవడానికి, పాత స్టాక్ వదిలించుకోవడానికి లేనిపోని పుకార్లను పుట్టిస్తారు. అక్కాచెల్లెళ్ళు లేదా వదిన మరదళ్ళు చీరలు పెట్టుకోవాలని లేదా గాజులు వేసుకోవాలని, వేయించుకోవాలని చెప్పడంతో అంతా పోలోమని ఆ పనులు చేస్తుంటారు. ఇలాంటివి ఎవరు పెట్టారు, ఎందుకు పెట్టారని ఎవరూ ఆలోచించరు. పండుగల మీద లేవదీసే పుకార్ల గురించి ఇందులో బాగా చెప్పారు.

"బుచ్చవ్వ" కు లగ్గం అయినంక ఇడుపు కాగితం అయి మారుమనువు చేసుకుంటుంది. ఈ రెండు కుటుంబాల పిల్లలు ప్రయోజకులై ,బుచ్చవ్వను బాగానే చూసుకుంటారు. కానీ ముసలితనంలో అందరినీ ఏడిపించుకుతిని చచ్చిపోతుంది. వాళ్ల ఊళ్లో ఉండే "ఆగయ్య" అనే కంసాలి ముసలివాడు ఉంగరాలు చేసి ఇచ్చేవాడు. పంచాంగం, జ్యోతిష్యం చెప్పేవాడు. పద్యాలు పాడేవాడు, పురాణాలు చెప్పేవాడు. భార్య చనిపోయిన తర్వాత ఒంటరివాడై ఊళ్లో వారి మీద ఆధారపడి బతికేవాడు. అతను చచ్చిపోతే ఊరంతా కదిలి వస్తుంది. చిన్నప్పుడు కత్తెర్ల బీరయ్య అనేవాడు వచ్చేవాడు. వాడు ఊర్లో ఉన్న బర్లకు, దూడలకు బొచ్చు కొరిగి డబ్బులు తీసుకుని పోయేవాడు. అతను కురమోడు అయినా, ఎవరు పిలిచినా వారింట్లో అన్నం తినేవాడు. ఇప్పుడంటే ఊర్లలో బర్లు లేవు. బీరయ్య అసుంటోళ్ళ అవసరం రాదు. వాళ్ల ఊరి "రాయేశ్వరి" అందం చూసి ఎవరో పాడు చేస్తే, మొగుడు విడిచి పెడతాడు. దాంతో పిచ్చెక్కి అడుక్కు తింటుంది. అప్పట్లో ఉన్న గ్రామ పెద్దలు, బంధువులు పట్టించుకుని ఉంటే బాగుండేది. దళితుల్లో పుట్టిన ఆడది కాబట్టి అందరికీ చులకన అయిపోయింది. కూరగాయలు అమ్ముకొని బతికే"రాణక్క" మొగుడు, తాగుడికి మరిగి పని మానేసి, ఏది ఉంటే అది ఎత్తుకుపోయి తాగేవాడు. రాణక్క తన కష్టంతో కొన్న స్థలాన్ని దగ్గరుండి ఇల్లు కట్టించుకుంటుంది. చివరకు మొగుడు బుద్ధి తెచ్చుకొని బాగుంటాడు. "పోసవ్వ" నాలుగు కిలోమీటర్లు నడిచి బడికి వచ్చేది. తొమ్మిదో క్లాస్ కు వచ్చిన తర్వాత సైకిల్ మీద వచ్చేది. గూడెం నుంచి వచ్చే వాళ్లకు వేరే మార్గం లేకుండే. "గోండులు దండారి" అనే వ్యాసంలో మా ఊరి పక్కన ఉన్న గిరిజన ఊళ్ళలో గోండులు, పర్ధాన్లు, నాయకపోడులు ఎక్కువగా ఉంటారు. దీనిలో పర్ధాన్లు, నాయకపోడుల సంప్రదాయాలు కొద్దిగా మనం చేసుకున్నట్టే ఉంటాయి. కానీ గోండుల పండుగలు, లగ్గాలు, సావులు అన్నీ వేరే విధంగా ఉంటాయని వివరిస్తారు. ఇలా వారు చూసిన, గమనించిన మనుషుల గురించి వారి మనస్తత్వాల గురించి, వారి గొప్పతనాలు గురించి తెలియజేస్తారు.

ఈ కథలు, వ్యాసాలను మాండలికంలో రాయడం వల్ల చెప్పదలచుకున్న విషయాలను ప్రతిభావంతంగా ప్రతిఫలించగలిగారు. ముఖ్యంగా కింది తరగతి ప్రజల జీవితాలని చిత్రించవలసిన సామాజిక అవసరంలో, వారి సంస్కృతి సాహిత్యంలో వస్తువుగా ప్రవేశించినప్పుడు, ఆ సంస్కృతిలో భాగమైన వారి భాష కూడా చాలా సహజంగా, అవసరంగా, అనివార్యంగా చోటు చేసుకుంటుంది. అలాగే తమ ప్రాంత మాండలికంలో ఉన్న సహజ సౌందర్యాన్ని తక్కిన ప్రాంతాల వారికి తెలియజేయాలనే తపనతోను, ఉత్సాహంతోనూ, రచయితలు మాండలికంలో రచనలు చేయడానికి పూనుకుంటారు. అలా కథనంలో, సంభాషణల్లో మాండలికాన్ని ఉపయోగించడం ద్వారా రచయిత్రి ఆయా కథలను మరింత రక్తి కట్టించగలిగారు. మాండలిక భేదాలను పట్టి చూస్తే ఇది దళితమాండలికంగా గుర్తించవచ్చు, రచయిత్రి మాండలికంలో ఆలోచించి మాండలికంలో రాశారని రచనలను బట్టి ఇట్టే గుర్తించవచ్చు. ఈ రచనల్లో కనిపించే సజీవమైన మాండలికాన్ని చదువుతుంటే ప్రాణం లేచి వస్తుంది. రచయిత్రికి నా అభినందనలు.

కె పి అశోక్ కుమార్
9700000948

# త్యాగాల తల్లై పసరంటిన కొడవలి

**అమ్మ!**
**అమ్మ! నన్ను కన్నందుకు**
**విప్లవాభివందనాలు**
**పొలాలలో పరిగే గింజ**
**ఏరుకునే వేళలందు !**
**శివ సాగర్**
**ఇంటి యాప కింద ఒంటిగా కూర్చొని**
**చింతల్లో మునిగినవోయమ్మ ఓయిరమ్మ**
**ఏంతాని కుములతవోయమ్మ**
**కరువూను చూసినావు**
**కాలాన్ని చూసినావు**
కాలి పేలిన బతుకు ఈదుకుంటూ వచ్చినావు !
గోరటి వెంకన్న

ఈ విధంగా తల్లుల వెతలను, కష్టాలను, కన్నీళ్లను ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య. పసరంటిన కొడవలిలో పొందుపరిచాడు. ఈ పసరంటిన కొడవలి,కవిత్వ పుస్తకాన్ని అమ్మ పేరు మీద తీసుకొచ్చిండు. అది పసరంటిన కొడవలే కాదు.కూలితల్లుల అన్నం గిన్నె, ఈ కొడవలె ,ఒక త్యాగాల తల్లి. నిత్యం ఆకలిని అవమానాలని మూట కట్టుకొని తిరుగుతున్నాడు. ఆయన క్షవర వృత్తి,చేస్తూ చిన్నతనంలోనే సామాజిక అంశాల మీద దృష్టి సారించాడు. ఒక ధిక్కార కవిగా నిలబడిండు. ఈ భూమిపైన ప్రజలకు హాని జరిగితే, కవిత్వమై కనిపిస్తాడు. అతను దుఃఖకవి, నిత్యం ప్రజల సమస్యల పైన అక్షరాలను సాయుదులుగా చేసి యుద్ధం ప్రకటిస్తాడు.

నాగర్ కర్నూల్ జిల్లా, వనపట్ల గ్రామంలో మంగలి బాలమ్మ, బాలయ్య లకు రెండవ సంతానం. యం .ఏ వరకు, చదువుకున్నాడు. ఎప్పుడు ఉద్యోగం వైపు వెళ్లలేదు. "కులవృత్తి మానకురా గువ్వల చెన్న" అన్న చందంగా నాగర్ కర్నూల్ లో ,కటింగ్ షాప్ పెట్టుకుని జీవనం గడుపుతున్నాడు. మరోపక్క కవిత్వం రాసి ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. తెలంగాణ పోరాటంలో అందరూ ఎంత రాస్తే, సుబ్బయ్య ఒకడు అంత రాసిండు. అనేక పుస్తకాలను ఉద్యమ కాలంలో ప్రచురించిండు. తెలంగాణ మీద ఈగ వాలకూండా ,సెంట్రీలా గస్తీ కాస్తాడు. సీమాంధ్ర దోపిడి పై ,రోమాలు నిక్క పొడిచే కవిత్వం రాసిండు.
గోరటి వెంకన్న పాటలు ఎంత పదునుగా ఉంటాయో, వనపట్ల సుబ్బయ్య ,కవిత్వం కూడా అంతే పదునుగా ఉంటది.

ఈ మట్టికి ఉండే స్వభావం. ఒక సురవరం ప్రతాపరెడ్డి ,గడియారం రామకృష్ణ శర్మ ,కపిలవాయి లింగమూర్తి, గోరటి వెంకన్న ఆ పరంపరలో, వచ్చిన కవి వనపట్ల సుబ్బయ్య ఒకటి మాత్రం నిజం. వనపట్ల సుబ్బయ్య కవిత్వం ఈ 20 సంవత్సరాల తెలుగు వాళ్ళ ఉత్తమ (సామాజిక విప్లవ) సంస్కారంలో భాగం. మన జీవనపు వ్యక్తీకరణ, ఈ వ్యక్తి కరణ మనందరం పది కాలాలు దాచుకోవాల్సిన కవిత్వం. దాచుకోవాల్సిన, గర్వించదగిన కవిత్వాన్ని అందించిన వనపట్ల సుబ్బయ్య మనకు అపురూపమైన పసరంటిన కొడవలి.

వనపట్ల సుబ్బయ్య చేసిన రచనలు వొల్లెడ, మశాల్, ఊర చెరువు, కుర్చీ, జన శంకరుడు, తడి, బహుజన బావుట, బుద్ధ గీతం, మా అక్షరం ఆయుధము,




తెలంగాణ తేనె పలుకులు, సెల్ఫ్ లాక్ డౌన్, అలాయి, బలాయి, అసిపె, తేజ్, పసరంటిన కొడవలి. 2011 నుండి 2026 వరకు విరివిరిగా రాస్తున్న దమ్మున్న తెలంగాణ ఆత్మగౌరవ కవి.
వనపట్ల సుబ్బయ్య వాళ్ళ అమ్మ బాలమ్మ చనిపోయి 23 సంవత్సరాలు అవుతుంది. అప్పటినుండి తల్లిని ప్రతిరోజు స్మరించుకుంటూ, అమ్మను సజీవంగా నిలబెట్టడం కోసం. పసరంటిన కొడవల్ని తీసుకొచ్చిండు.

**పొద్దంతా వరిసేను కోసి**
**పెసరుతీగ ఒడ్డు మీద కట్టలు మోసి**
**కళ్ళం కాడ కుప్పేసి**
**సంధ్యాల ఇంటికొచ్చి నన్ను కన్నదంట**
**సాయంత్రం చంద్రుడు రాక**
**నీ రాక ఒకటే సారని**
**ముద్దుల ముచ్చట్లతో నిండా ముంచేసే అమ్మ**

ఈ విధంగా సుబ్బయ్య వాళ్ళ అమ్మ ఎలాగన్నదో ,తన కవిత ద్వారా తెలియపరచిండు. తల్లి బిడ్డల కోసం మొక్కని దేవుడు లేడు, కట్టని తాయెత్తు లేదు. ఎన్ని బాధలు ఉన్నా, బిడ్డల కోసం ఓర్చుకొని బతుకును యెల్లా తీసింది అమ్మ. అమ్మ మనకు దూరమైతే ,ఆ దుఃఖం, ఆ బాధ ,మాటల్లో చెప్పలేనిది.

**దోసిలి పట్టి ఎదురుచూస్తున్న అమ్మ**
**దోసిళ్ళు పడుతున్న**
**కూలిపోతున్న గుంపుల**
**ఏడ ఉన్నావని వెతుకుతున్న**
**గెట్టున మునుం పడితే**
**చేనంతా నీ పిడికిట్ల**
**చీమల బారుల్లా కరిగట్ల వరినాట్లు**

అమ్మను ఏడ ఉందని వెతుకుతున్నాడు. కనిపించిన ప్రతి ఒక్కరిలో, వాళ్ల అమ్మ మొఖం చూసుకుంటాడు. అమ్మ చేసిన పనులను నెమరు వేసుకుంటున్నాడు. నీ మాట పాటలు ఎవరన్నా పాడితే వినాలని ఉంది అని దుఃఖిస్తుండు.

**అమ్మా! కవితాభివందనాలు**
**అర్ధరాత్రి ప్రసవించి**
**ముండ్ల పొదలో విసిరేయనందుకు**
**కుక్కల పందుల పాల్ చేయనందుకు**
**అవమానాల పొత్తికడుపులో పొదుస్తున్న**
**చక్కని రూపాన్ని ఇచ్చినందుకు**
**సమాజంలో ధ్వజంలా నిలబెట్టినందుకు**
**అమ్మా! నన్ను కన్నందుకు కవితాభివందనాలు**

**ఈరోజుల్లో పిల్లలు పుడితే పేదరికంతో పడేస్తున్నారు.**
**అలా**
**నన్ను కని కుక్కల పాలు ,చేయలే నక్కల పాలు ,చేయలే**
**చక్కని రూపం ఇచ్చినందుకు ,నేను ఆత్మగౌరవంతో**
**తల ఎత్తుకొని నిలబడ్డానని గర్వంగా చెప్పుతున్నాడు.**
**అమ్మ కూలికిపోయింది**
**ప్రతి ఊరుకు**
**ప్రతి గడపకూ**
**చరిత్ర ఉన్నట్లు**
**అమ్మకు ఓ చరిత్ర ఉంది**
**అమ్మకు ఓ చరిత్ర ఉంది. ఆమెనే ,ఒక చారిత్రక నేపథ్యం అంటారు.**

**అమ్మ మహాబోధి అంటాడు**
**చెట్టు మరణిస్తే కదా**
**అమ్మ వెళ్ళిపోవడానికి**
**చెట్టుది నిత్య వసంతం**
**అమ్మ ప్రేమ పరిమళమే!**
**ఆమె త్యాగాలను కొనియాడుతాడు. అమ్మ మహాదాత అవనికి బిడ్డను బహుమానంగా ఇచ్చే త్యాగశీలి అని గర్వంగా చెప్పుతుండు.**

**వేల వెన్నెల ముచ్చట్లు**
**సూర్యుడు మధ్యాహ్నమే కుంగి**
**గూటిలోకి వెళ్లిపోయినట్లుంది**
**డాంబర్ రోడ్డు మీద**
**భర్తీ బండి వాటు పడినట్లు**
**వాకిట్లో పిడుగు పడినట్లు**
**దీపాలు లేని రేతికి పట్టపగలు కారు చీకట్లు**
**అంతా గద్దె ఎత్తుకపోయినా తండ్లాట**
**అమ్మ లేదన్న వార్త ,ప్రపంచం మాయమైనట్లు ,వెలుగును చీకటి కమ్మినట్లు ,ఆకాశమే ఊడి పడినట్లుగా ఉంది అంటాడు.**
**అమ్మ ఒక మహా కావ్యం**
**అమ్మ పుట్టుకే**
**ఒక పోరాటం**
**బతుకుతెరువు ఒక కథనరంగం**
**కాలం వెంబడి కష్టజీవి**
**శ్రామిక పతాకం**
అమ్మ లేకపోతే ప్రపంచమే ఉండదు. ప్రాణకోటికి అమ్మనే మూలం. బతుకంతా ఒక పోరాటం. ఒక యుద్ధరంగం. ఆమె ఆత్మ గౌరవం శ్రామిక పతాకమని వర్ణిస్తాడు.
ఈ విధంగా కవుల, రచయితల, ప్రముఖ రాజకీయ వేతల అమ్మలు కాలమైనప్పుడు. చాలా కవితలు రాసిండు. ఇవన్నీ పసరంటిన కొడవలిలో ఉన్నాయి.
అమ్మ జన్మనిచ్చింది. లోకాన్ని పరిచయం చేసింది. దేవుడు లేడు కానీ అమ్మ ఉంది. అమ్మనే సత్యం. అమ్మనే నిజం అంటాడు.

అమ్మకు చదువు రాదు. అమ్మకు కూలే... చదువు కూలే జ్ఞానం. వాన కురుస్తు ,కురుస్తూ వెన్నెల ముదుసుకున్నట్లు మా అమ్మ మధ్యంతరంగా వెళ్లిపోయింది. కానీ "అమ్మ"అనే మాట మరుపుకు రాదు. మరువలేను. అమ్మ ఆజన్మాంతం వినిపించే వెన్నెల్లో జోలపాట. అమ్మ ఎదను తాకే చల్లని పిల్లగాలి అని కొనియాడాడు.

ఇది ఒక దుఃఖ గాధ, ఇలాంటి అమ్మ పుస్తకాన్ని తీసుకొచ్చిన వనపట్ల సుబ్బయ్యకు, ప్రత్యేక ధన్యవాదాలు.

ఎదిరెపల్లి కాశన్న
964 000 63 04

# కథల సంపుటాలకు ఆదరణ ఎంత?

తెలుగులో వార, మాస పత్రికలు విరివిగా వచ్చే రోజుల్లో ఒక్కో సంచికలో నాలుగైదు కథలున్నా, అమ్మకాలు మాత్రం వాటిలో ఉండే సీరియళ్లపైనే ఆధారపడేవి. సీరియళ్లు రాసే రచయితలకు, మరి ముఖ్యంగా రచయిత్రులకు మంచి డిమాండ్ ఉండేది. కథేంటో తెలియకున్నా రాయబోయే సీరియల్ మాకే ఇవ్వండి అని పత్రికలవాళ్లు అడ్వాన్స్ బుకింగ్ చేసుకొనేవారు. ఫలానా వారి సీరియల్ వస్తోంది అంటూ పత్రికలో ముందస్తు ప్రకటనలు వచ్చేవి. సీరియల్ కావాలి అన్నంతగా మీ కథ ఇవ్వరా అని పత్రికలు అడిగిన వేళలు తక్కువ. ప్రత్యేక సంచికల కోసం పెద్ద, పేరున్నవారిని కథల కోసం అడిగివుండొచ్చు. కథా రచయితలు ఎక్కువగా ఉన్నందువల్ల ఆ అవసరం పత్రికలవారికి రాకపోవచ్చు.

పాఠకుల్లో వీరాభిమానులు రచయితల సీరియళ్ల పేజీలను పత్రికలోంచి విడదీసి బైండింగ్ చేయించి భద్రంగా దాచుకునేవారు. కథలకు అలాంటి భాగ్యం దక్కలేదనే చెప్పాలి. నవలలు రాసిన వారి పేర్లు చెప్పినంత ఈజీగా కథలు మాత్రమే రాసినవారి పేర్లు చెప్పడం కష్టమే. కథతో పోల్చితే నవల పెద్ద రచన. మానసికంగా, శారీరకంగా రాసేవారిని మెలిపెట్టే ప్రక్రియ ఇది. ఒక ఆలోచనను కథగా మలిచినంత తేలిగ్గా నవలను రాయలేరు. ఎక్కువ పాత్రలు, నిడివి, ఎన్నో మలుపులు ఉండే నవలను రాసి మెప్పించడం సామాన్యమైన పని కాదు. దాదాపుగా నవలలన్నీ శ్రమకోర్చి రాసినవే. అయితే అన్నిటికి పాఠకుల ఆదరణ సమానంగా లభించలేదు.

ఏ కాల్పనిక రచనకైనా చదివించే గుణం తప్పక ఉండాలి. అలా ఉన్న కథ పాఠకుడి మనసుపై ముద్ర పడి జ్ఞాపకాల పొరల్లోకి వెళుతుంది. దాని తరవాత ఎన్నో కథలు చదవడం వల్ల ముందు చదివిన కథలు మరుపులోకి వెళ్లిపోతాయి. గుర్తుండిపోయే కథలు, పాత్రలు కొన్నే. నచ్చిన కథను మించిన మరో కథ వస్తే, పోలిక వల్ల ముందు కథ కొంత తేలిక కావచ్చు. ఒకే రచయిత కాలక్రమంగా ఎదుగుతూ రాసే కథల్లో కూడా నాణ్యత భేదాలు ఉండొచ్చు. ఇలా సముద్రపు అలలుగా వచ్చే కథల్లో మనసులో ఇంకిపోయేవి కొన్నే ఉంటాయి. కథ ఒక సంఘటన, నవల కొన్ని జీవితాల లేదా కొంత కాలానికి చెందిన వర్ణన. కథలోని పాత్రల కన్నా నవలలోని పాత్రలు ఎక్కువగా గుర్తుంటాయి. ఆయా పాత్రల గురించి చాలా వివరంగా, విస్తృతంగా చదువుతాము కాబట్టి వాటి పట్ల ఇష్టమో, అయిష్టమో ఏర్పడిపోతుంది. అలా అవి పాఠకుడి వెంట ఉండిపోతాయి. సహజంగానే సంఖ్యాపరంగా నవలల కన్నా కథలే ఎక్కువ. ఏ పాఠకుడైనా కథలే ఎక్కువ చదివి ఉంటాడు. మూడు, నాలుగు పేజీల కథలను అలవోకగా చదివేస్తూనే ఉంటాడు. అది బాగుందా లేదా అనేది చదివాకనే తెలుస్తుంది. అదే నవల విషయానికొస్తే చదవాలా వద్దా అని ముందే ఎంచుకొని ఆరంభిస్తాడు. రచయిత ముందు రచనలు ఇష్టమైతే తప్పక చదివేస్తాడు. కొత్త రచయిత అయినా మంచి పాపులారిటీ వస్తే చదవడానికి ఇష్టపడతాడు. నచ్చితే పూర్తి చేస్తాడు లేకపోతే మధ్యలోనే వదిలేస్తాడు. మంచి నవలలు ఇంట్లో మిగిలిపోతే, అవసరం లేనివి బజార్లోకి వెళ్లిపోతాయి. మళ్ళీ చదివే అవసరం అవకాశం లేకున్నా నచ్చిన నవలలను భద్రంగా దాచుకుంటారు. అది ఆ పుస్తకంపైనున్న ప్రేమ.

పత్రికల్లో వచ్చే సమీక్షల ఆధారంగా కూడా నవలలు అమ్ముడుపోతున్నాయి. కథలు ఇదివరకే పత్రికల్లో చదివాం కదా అనే భావన వల్ల కొనుగోలుపై ఆసక్తి ఉండదు. అప్పటికే చదివిన కథలే సంపుటాలుగా రావడం అనేది రచయిత స్వీయాభిలాషే. కథలన్నీ ఒక్క చోట ఉంటాయని పుస్తకంగా వేస్తుంటారు. నవల రాసేదే పుస్తకంగా వేయడానికే. అయితే కవిత, కథా సంపుటాలు వేసుకున్నంత తేలిగ్గా నవలలను రచయిత సొంతంగా వేసుకోలేరు. ఏదో ఓ ప్రచురణకర్త ముందుకొచ్చాకే నవల రచన మొదలవుతుంది.రచయితలున్న డిమాండ్ ను బట్టి అమ్మకాలు ఉంటాయి. పుస్తకం బాగుందని తెలిస్తే ఎప్పుడైనా చదవచ్చులే అని కొనే పాఠకులు ఎక్కువ. పునర్ముద్రణ పొందిన ఎన్నో నవలలు ఉన్నట్లు రీప్రింట్ కథా సంపుటాలు తక్కువ.

ప్రచురణ అయిన కథలను మళ్లీ వేయడమెందుకు అని పబ్లిషర్స్, చదివిన కథల పుస్తకం కొనడమెందుకు అని సాధారణ పాఠకులు కథా సంపుటాలకు దూరమైతున్నారని చెప్పవచ్చు. నిజానికి కవితా సంపుటాలకు ఉన్న అమ్మకాలు కూడా కథల పుస్తకాలకు లేవు. నచ్చిన కవితలను మళ్ళీ చదవడానికి , ఇంట్లో దాచుకోవడానికి ఇష్టపడేవాళ్లు ఉన్నారు. ఎందుకంటే కవితకున్న ఆకర్షణ వేరు. కవి వాడిన పదాలు, చెప్పిన పద్ధతి, శైలి, భావజాలం మనసుకు దగ్గరై మళ్ళీ తిరిగేయాలన్న ఆసక్తిని నిలిపి ఉంచుతుంది. కొన్ని ప్రచురణ సంస్థలు పేరున్నవారి కథలను ఎంచుకొని సంపుటాలుగా తెస్తున్నాయి. మన మధ్య లేని గొప్ప కథకుల సంపుటాలకు మంచి ఆదరణ లభిస్తోంది. పుస్తక రూపంలో వస్తున్న అన్నిసాహిత్య ప్రక్రియలకు ఒకేలా పాఠకుల ఆదరణ లభించే అవకాశం ఉండదు. దేని విలువ దానికున్నా పుస్తకంగా వచ్చాక అమ్మకాల్లో ఉన్న వ్యత్యాసం ఈ నిర్ధారణకు బలాన్నిస్తోంది.

బద్రి నర్సన్ 9440128169



# కొత్తపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి అనుహ్య స్పందన

- చేనేత సహకార సంఘం–రిలీఫ్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- 100 మందికి పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ



**కరీంనగర్ మహా :** ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు కొత్తపల్లి(హెచ్)లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కొత్తపల్లి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రిలీఫ్ ప్రైమ్ ఆస్పత్రి సహకారంతో చేనేత పారిశ్రామిక సహకార సంఘం భవనంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.డాక్టర్ ఎండి జనరల్ ఫిజీషియన్ శ్రీనివాస్ ప్రజలను పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్య సలహాలు అందించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

**ప్రారంభ దశలో గుర్తిస్తే సమస్యలకు చెక్**

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వంటి ఆరోగ్య సమస్యలు చాలాసార్లు ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకుండానే ఉంటాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడంతో పాటు ఆహారం, జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవాలని సూచించారు.

**చేనేత కుటుంబాలకు వైద్య సేవలు**

చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ రిలీఫ్ ప్రైమ్ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి వచ్చిన 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. చేనేత సహకార సంఘం-రిలీఫ్ ప్రైమ్ ఆస్పత్రి కలిసి ఉచిత వైద్య నిర్వహించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని వారు కోరారు.

# 54 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

**నలుగురు నిందితుల అరెస్టు**



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 9 మహా:** డ్రగ్స్ అక్రమ రవాణాపై యాదాద్రిభువనగిరి పోలీసుల భారీ ఆపరేషన్ నిర్వహించి 54 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకొని, నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు . ఈ కేసుకు సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లాఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి . బీబీనగర్ పోలీసులు, ఎస్ ఓ టి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా బీబీనగర్ పోలీసులు మరియు ఎస్ ఓ టి యాదాద్రిభువనగిరి పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. . ఈ ఆపరేషన్‌లో 27 కిలోల నిషేధిత మెఫెడ్రోన్ డ్రగ్‌ను, సుమారు రూ.54 కోట్ల విలువైన మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 8న కొండమడుగు గ్రామ శివారులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా, MH49CW1313 నంబర్ గల ఫార్చ్యూనర్ కారును పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో 27 కిలోల మెఫెడ్రోన్‌తో పాటు డ్రగ్ తయారీలో ఉపయోగించే సుమారు 40 కిలోల అసిటోన్ లిక్విడ్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులు ఏ1 చేతన్ మధుకర్ మెష్రామ్, (49) నాగ్‌పూర్, మహారాష్ట్ర,ఏ2. ముజామల్ హక్, ( 25), మారిగావ్, అస్సాం,ఏ3. ఆకాశ్ అశోక్ గవాండే, (31) , నాగ్‌పూర్, మహారాష్ట్ర,ఏ4. ఉపద్రష్ట రమణ మూర్తి, ( 65) , చందానగర్, హైదరాబాద్లను అరెస్టు చేశారు పరారీలో ఉన్న మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కేసులో పోలీసులు స్వాధీన చేసుకున్నవి:27 కిలోల మెఫెడ్రోన్ సుమారు రూ.54 కోట్ల విలువ,40 కిలోల అసిటోన్ లిక్విడ 6 సెల్‌ఫోన్లు, MH49CW1313 నంబర్ గల ఫార్చ్యూనర్ కారు వేటుకూరి ల్యాబ్స్‌లోని రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ మరియు ఇతర డ్రగ్ తయారీ పరికరాలు తయారు చేసిన డ్రగ్‌ను కొండమడుగు నుంచి నాగ్‌పూర్‌కు తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో తేలింది.నిందితుల సమాచారం మేరకు పోలీసులు వేటుకూరి ల్యాబ్స్‌కు వెళ్లి తనిఖీ చేయగా, డ్రగ్ తయారీలో ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం కంపెనీని చట్ట ప్రకారం సీజ్ చేయడానికి చర్యలు తీసుకోబడతాయి.అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా, తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజలు డ్రగ్స్ బారిన పడొద్దు సమాచారం ఉంటే పోలీసులకు తెలుపండి



# ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**ఆదిలాబాద్ మహా:** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్నిఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. యువతను రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీకి అనుసంధానంగా యూత్ కాంగ్రెస్ ఏర్పడిందని నరేష్ జాదవ్ తెలిపారు. నాటి నుంచి నేటి వరకు అనేక మంది యువ నాయకులు యూత్ కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారని అన్నారు.యూత్ కాంగ్రెస్ కేవలం రాజకీయ సంస్థగా కాకుండా యువత సమస్యలపై పోరాడే వేదికగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడే శక్తిగా, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే యువజన శక్తిగా పనిచేయాలని ఆయన సూచించారు.ప్రస్తుతం దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, క్రీడలు, డ్రగ్స్ సమస్య, పర్యావరణ పరిరక్షణ, మహిళా భద్రత వంటి అంశాలపై యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శాంతన్ రావు,నాహిద్ ,బద్దం పోతా రెడ్డి,వేముల నాగరాజు , సామా రూపేష్ రెడ్డి, సుగత్, కాంగ్రెస్ నాయకులు అల్లూరి సంజీవరెడ్డి, సాజిద్ ఖాన్, ఆనందరావు, మంగేష్ దేవతాడే, దేవదాస్ చారి అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ గీత కార్మికులకు
# ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

**ఆలేరు చేరిన గీతన్నల చైతన్య యాత్ర**



**ఆలేరు ఆగస్టు 9 మహా:** గీత కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఆగస్టు 2న మానుకోట నుండి ప్రారంభమైన అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర నేడు ఆలేరుకు చేరుకుంది.... ఈ సందర్భంగా వేణు కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి, అమర గీత కార్మికులకు పూలమాలలు వేసి రాష్ట్ర కలుగీత కార్మిక సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గీతా కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు... ప్రతి గీత కార్మికులకు 4000 పింఛను, 10 లక్షల ఎక్స్గ్రేషియా అధికారంలోకి వస్తే 30 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలైనా ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు...కార్యక్రమానికి సిపిఎం మండల అధ్యక్షుడు వెంకన్న గౌడ్ స్వాగతం పలికారు వెంకన్న, చేనేత సహకార సంఘం అధ్యక్షులు దాసి శంకర్ అమరుల యదయాత్రకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాకారుల బృందం తమ ఆటపాటలతో పట్టణంలోని మెయిన్ రోడ్ లో ప్రదర్శన నిర్వహించారు. గీతాన్నల చైతన్య యాత్ర బృందానికి స్థానిక నాయకులు డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. గౌడ సంఘం పూర్వపు నాయకులు స్వర్గీయ మొరిగాడి యాదగిరి గౌడ్, సుదగాని ఎట్టయ్య గౌడ్ లను, ఇతర అమరులను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. బృంద సభ్యులను,స్థానిక సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు రాగిర్ కిష్టయ్య, జిల్లా కార్యదర్శి జయరాములు, రాష్ట్ర నాయకులు మొరిగాడి చంద్రశేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు కోరుకోప్పుల కిష్టయ్య గౌడు, జిల్లా నాయకులు మొరిగాడి రమేష్ గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ బొమ్మకంటి లక్ష్మీనారాయణ గౌడ్ సభను ఉద్దేశించి మాట్లాడారు. అమరుల కుటుంబాల చెందిన నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాయకులు దూసరి మురళి గౌడ్, బొమ్మకంటి బాలరాజు గౌడ్, మొరిగాడి అజయ్ గౌడ్, మొరిగాడి లక్ష్మణ్ గౌడ్, చింతల్ బస్తి, మొరిగాడి శ్రీశైలం గౌడ్, కూరగాయల నాని గౌడ్, గనగాని రాజు గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి గౌడ్, ఎస్ యాదగిరి గౌడ్, మొరిగాడి బాలయ్య గౌడ్, గనగాని మల్లేశం గౌడ్, దూడల యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ములకు నివాళులర్పించిన ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, నరేందర్

**రాజేంద్రనగర్ మహా ;** ఆగస్టు 8వ క్విట్ ఇండియా ఉద్యమం దినోత్సవం (క్రాంతి దివస్) సందర్భంగా శనివారం గాంధీభవన్లో టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్ మహాత్ములు ఘనంగా నివాళులర్పించారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా నరేందర్ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వచ్ఛంద సంస్థతో కలిసి రాట్నంపై నూలు పోగుల వడకుతు చేనేత వస్త్రాల ( ఖాదీ) తయారీని ప్రోత్సహించారు.ఖాదీ కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిరసనకు మరియు దేశభక్తి కి చిన్నంగా మారిందన్నారు.



# గత ప్రభుత్వంలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించింది యూత్ కాంగ్రెసే

**భువనగిరి ఆగస్టు 9 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలోయూత్ కాంగ్రెస్ 66 వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండాను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్దేశించి ప్రసంగించారు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ జెండాను భుజాన మోసింది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు లేని అభినందించారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ గౌడ్, మండల అధ్యక్షులు సూర్కాంటి సత్తిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం వాసుదేవ్ రెడ్డి, మండల ప్రెసిడెంట్ నిఖిల్ రెడ్డి, జిల్లా నాయకులు మండల నాయకులు యూత్ నాయకులు ఇతర ప్రజాప్రతిని పాల్గొన్నారు.



# రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎంపీ.

**భువనగిరి ఆగస్టు 9 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారిని ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి లు వారి వెంట పలువురు ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# పిటి నాయుడు సేవలు చిరస్మరణీయం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, సీనియర్ దళిత నాయకులు పిటి నాయుడు ఆకస్మిక మరణం ఎంతో బాధాకరమని ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. పిటి నాయుడు మృతదేహాన్ని మద్దెల శివకుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ పిటి నాయుడు సింగరేణి కాలరీస్ లో పనిచేయడం జరిగిందన్నారు. తెలంగాణ తొలి మలి దశల ఉద్యమాలలో కూడా పిటి నాయుడు క్రియాశీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ నివాళి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటుమాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెబి శౌరి, ఐఎన్టీయూసీ సింగరేణి ఏరియా సెక్రెటరీ రజాక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి పాల్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, పెయింటర్ ప్రకాష్, సీనియర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఎ రజాక్, సీనియర్ సిపిఐ నాయకులు మాతంగి లింగయ్య, దళిత సంఘాల జిల్లా నాయకులు సుబ్బారపు మధుసూదన్ చిన్ని, కూర రవీందర్, బీరమోహనరావు, భూపతి అశోక్, మచ్చ పృథ్వీరాజ్, కనుకుంట్ల బాబన్న, కండక్టర్ ప్రసాద్, మెకానిక్ వెంకట్, రాము, రాజేశ్వరరావు, సాయి కుమార్, శ్యామ్, సి ఎస్ ఐ చర్చి పాస్టర్లు, కమిటీ సభ్యులు, స్త్రీల కూటమి సభ్యులు, దేవుని బిడ్డలు, కుటుంబ సభ్యులు ఉన్నారు.



# ఆదిలాబాద్‌లో బోనాల సందడి

**బోనమెత్తిన మున్సిపల్ చైర్ పర్సన్**

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తన సొంత కాలనీ 45వ వార్డు లోని భుక్తాపూర్ కాలనీ తో పాటు బాలాజీ గార్డెన్ కాలనీ, సంజయ్‌నగర్ కాలనీ లలో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ బోనాల పండుగ మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. తరతరాలుగా మన గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ నిర్వహిస్తున్న పండుగల్లో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం మన సంప్రదాయంగా చెప్పారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నామన్నారు. మంచి వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా కాలనీల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్ ఆత్రం వెంకటేష్, దశరథ్ పటేల్, కాలనీవాసులు, పట్టణ ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**పోరాట యోధులకు కలెక్టర్ ఎస్పీ నివాళ్లు**

ఆదిలాబాద్ మహా: ఆదివాసీలు అన్ని రంగాలలో రాణించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా , ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో ప్రధాన్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వారు హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించి కొమురం భీం, రాంజీ గోండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించి, ఆదివాసీలతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేశారు.ఆదివాసీల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగపరచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ఆదివాసీలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం తోపాటు ఐటీడీఏ ద్వారా పూర్తి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.అటు ఆదివాసీల అభివృద్ధి కోసం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో గ్రంథాలయాలు, వాటర్ ప్లాంట్, వైద్య శిబిరాలు, క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఆదివాసీ విద్యార్థులు చదువులో రాణించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆదివాసి పోరాట యోధుల ఆశయ సాధనకై పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ఆదివాసీలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణం

- సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్న మున్సిపల్ చైర్ పర్సన్
- కొత్త పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపిన బండారి అనూష

**ఆదిలాబాద్ మహా:** ఆర్య వైశ్యులు ఐక్యతగా ఉంటూ అభివృద్ధి పథంలో పయనించాలని ఆదిలాబాద్ మున్సిపల్ ఛైర్పర్సన్ బండారి అనూష ఆకాంక్షించారు. పట్టణంలోని సెంట్రల్ గార్డెన్ లో ఆదివారం నూతనంగా ఎన్నికైన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఆర్యవైశ్యుల కుల దైవం వాసవి మాత కు పూజలు చేసిన అనంతరం నూతన అధ్యక్షుడు మల్లూర్ వార్ చంద్రకాంత్ తో పాటు ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మహాజన్, కోశాధికారులు గందే రవి కుమార్, గురు ప్రకాష్, కార్యదర్శులు జనగం దినకర్, దెబ్బడి రాకేష్ మరో 50 మంది కార్య వర్గ సభ్యులు ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గానికి మున్సిపల్ ఛైర్పర్సన్ శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆర్యవైశ్య కులస్తులకు అండగా ఉండాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో కూడలి సుందరీకరణకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. అలాగే భవిష్యత్తులో తన పరిధిలో ఉండే ఏ సహాయమైనా నెరవేర్చడానికి ముందుంటానని హామీ ఇచ్చారు.సామాజిక సేవే లక్ష్యంగా ఆర్య వైశ్యుల అభ్యున్నతికి పాటు పడతామని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్ అన్నారు. ఆర్య వైశ్యుల కీర్తిని ఇనుమడింప జేసేలా నిరుపేద వైశ్య కుటుంబాలకు అండగా ఉంటామని నూతన అధ్యక్షుడు అన్నారు. ప్రభుత్వ పరంగా వారికి అందాల్సిన ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు. అండగా నిలిచి విజయాన్ని అందించిన కులస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,ఆర్యవైశ్య సంఘ నాయకులు ,ఆర్యవైశ్య కులస్తులు పాల్గొన్నారు.






# ఘనంగా గాంధారి మైసమ్మ జాతర

**భక్తి తో బోనాలు సమర్పించిన భక్తులు**

**క్యాతనపల్లి మహా :** క్యాతనపల్లి మున్సిపాలిటీ బొక్కల గుట్ట జాతీయ రహదారిని అనుకోని వున్న గాంధారి మైసమ్మ ఆలయం లో బోనాలను మొక్కు బడిగా భక్తులు సమర్పించారు. ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శిం చుకుని మొక్కలు చెల్లించుకున్నారు. పాలవాగు ఒడ్డు నుండి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక బోనాలను క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ గోడిసేల సంధ్యారాణిరాజారమేష్, శివసత్తులు, మహిళా భక్తులు నెత్తిన బోనమేత్తుకొని డిజే పాటలు, డప్పు చప్పుళ్లు, నడుమ పోతురాజుల విన్యాసాలు చేస్తుం డగా సాంప్రదాయ పద్దతిలో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వా తావరణం నెలకొంది. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సు లు పొందారు. ఈ సందర్భంగా చైర్మన్ సంధ్యారాణి, పలు పార్టీల రాజకీయ నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక మైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న జాతరకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞ తలు తెలిపారు. రానున్న రోజుల్లో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జాతర సమయంలో ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించి ట్రా ఫిక్‌కు అంతరాయం కలగకుండా నియంత్రించారు. భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు కల్పించారు. జాతరను పురస్కరించుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పుర ప్రజలు, అధికారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర విజయవం తం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కుల సమ్మయ్య, సభ్యులు, కృతజ్ఞతలు తెలిపారు.



# డ్రగ్స్, సైబర్ క్రైమే పోలీసులకు ప్రధాన సవాళ్లు

- నక్సలిజం నుంచి సైబర్ నేరాల వరకు పోలీసింగ్ లో భారీ మార్పు
- డ్రగ్స్, సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- తెలంగాణ డీజీపీ సీ.వి ఆనంద్




**వరంగల్, క్రైమ్ మహా ;** తెలంగాణలో మావోయిజం దాదాపు పూర్తిగా కనుమరుగైందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మావోయిస్టు బాధిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వరంగల్ లో పర్యటిస్తున్న ఆయన, ఐపీఎస్ గా తన ప్రస్థానం ఈ జిల్లాలోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ క్రైమ్ ప్రధాన సవాళ్లుగా మారాయని, సైబర్ నేరాలతో ప్రజలు భారీగా డబ్బు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ లో అధిక లాభాల ప్రకటనల పట్ల అప్రమ త్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్ లో అతిపెద్ద సవాలైతే, ఇప్పుడు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లు గా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును ఆదివారం సమీక్షించిన ఆయన, పోలీసింగ్ లో సాంకేతికత ఎంత కీలకమైనా మౌలిక పోలీసింగ్‌ను విస్మరించరాదని అధికారులకు సూచించారు.జిల్లాలోని ఎన్ఐటీ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో , టీస్ప్రార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, నూతన సాంకేతిక వ్యవస్థల పై ప్రజెంటేషన్ ఇచ్చారు.

**వరంగల్ తో అనుబంధం**

వరంగల్ తో విడదీయరాని అనుబంధం తన ఐపీఎస్ ఉద్యోగ జీవితం వరంగల్ లో జిల్లా శిక్షణతో ప్రారంభమైందని, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన రోజులు మరువ లేనివని డీజీపీ గుర్తుచేసుకున్నారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో ప్రతి రోజు ప్రమాదకరంగా ఉండేది. ల్యాండ్ మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వ ర్తించే వారమని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో నేడు నెలకొన్న శాంతిభద్రతలు పోలీసు అమరుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు.

**సైబర్ మోసాల తో రూ.1,700 కోట్ల నష్టం**

గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల వల్ల ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు కోల్పోయారని డీజీపీ వెల్లడించారు. మోసపోయిన వెంటనే ఫిర్యాదు చే యకపోవడం వల్ల డబ్బు రికవరీ అవకాశాలు తగ్గు తున్నాయని చెప్పారు. అధిక లాభాల పేరుతో జరిగే పెట్టుబడి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే అగ్రస్థానం**

సైబర్ నేరాల నియంత్రణలో ప్రధానమంత్రి ప్రగతి సమీక్షలో తెలంగాణకు దేశంలోనే తొలి స్థానం లభిం చిందని డీజీపీ తెలిపారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించా లని సూచించారు.

**మౌలిక పోలీసింగ్ కే అధిక ప్రాధాన్యం**

సాంకేతికత పోలీసింగ్ కు తోడ్పాటే కానీ ప్రత్యామ్నా యం కాదని డీజిపి స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ల లో ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించాలని, దర్యాప్తులు, కోర్టు కేసుల పర్యవేక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. డీసీపీలు, ఏసీపీలు, డీఎస్పీలు క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం గడుపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

**యువత, చిన్నారులను లక్ష్యంగా డ్రగ్స్..**

చాక్లెట్లు రూపంలో చిన్నారులను మాదక ద్రవ్యాలకు అలవాటు చేసే ప్రయత్నాలు ఆందోళనకరమని డీజీపీ అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ ని వారణలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

**20 శాతం ఖాళీలతో కమిషనరేట్**

వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజెంటేషన్ లో కమిషన రేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, 3,758 మంజూరైన పోస్టుల్లో 2,976 మంది మాత్రమే విధుల్లో ఉండగా 782 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించా రు. నేరాల నమోదు సుమారు 10 శాతం పెరిగినట్లు తెలిపారు.

**రైళ్లలో వచ్చి నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలు**

బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి రైళ్లలో వచ్చి వరంగల్, కాజీపేట కేంద్రంగా చైన్ స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడి వెంటనే వెళ్లి పోతున్న ముఠాల పై ప్రత్యేక నిఘా పెట్టామని కమిషనర్ వివరించారు. నాట్ గ్రిడ్ సహకారంతో సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

**'నేను సైతం'కు డీజీపీ ప్రశంసలు**

ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చే పట్టిన 'నేను సైతం' కార్యక్రమాన్ని డీజీపీ అభినందిం చారు. ముఖ్యంగా నల్లబెల్లి, పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన చర్యలను ప్రశంసించారు.

**పెరుగుతున్న దోపిడీలు, సైబర్ కేసులు**

దోపిడీ కేసులు 7 నుంచి 18కు, తాజాగా 29కు పె రుగుదల.సైబర్ మోసాల కేసులు 25 నుంచి 59కు, 2026 జనవరిజూలై లోనే 119 కేసులు నమోదు. ఉద్యోగాల పేరుతో మోసాల కేసులు 40 నమోద య్యాయి.ప్రజా పంపిణీ వ్యవస్థ కు సంబంధించిన 117 కేసులు నమోదు అయ్యాయి.సాంకేతిక ఆధారిత పోలీసింగ్ ను మరింత విస్తరించి ప్రజల భద్రతను బలోపేతం చేయాలని డీజీపీ అధికారు లను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరు, నేరాల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల భద్రత, ఆర్థిక నేరాల ధోరణులు, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివ రించారు.



# మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక భరోసా

**హసన్ పర్తి పోలీసులు**

**జనగామ, మహా :** జఫర్‌గడ్ మండలం కునూరుకు చెందిన కానిస్టేబుల్ పారుపల్లి ధనుంజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హసన్‌పర్తి సీఐ ఎ. మహేందర్, స్టేషన్ సిబ్బంది రూ.75 వేల ఆర్థిక సాయంతో పాటు, పోలీస్ కమిషన ర్ మంజూరు చేసిన రూ.30 వేల దహన సం స్కారాల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని ఇన్స్పెక్టర్ మహేందర్ హామీ ఇచ్చారు.



# బోనంమెత్తిన కౌన్సిలర్ బిల్లపాటి కవిత

- మొయినాబాద్ పరిధిలోని పలు గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సి పాలిటీ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆషాఢ బోనాల పండుగను ఆదివారం భక్తిశ్ర ద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి నైవేద్యాలు సమర్పించారు.బోనాల సందర్భంగా ఆలయాల వద్ద డప్పు చప్పుళ్లు, మేళతాళాలతో సందడి నెలకొంది. చిన్నారు లు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకోగా, పోతురాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయాల వద్ద ప్రత్యేక హారతులు నిర్వహించి గ్రామ ప్రజల సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవా రిని వేడుకున్నారు.ఉత్సవాల్లో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.



# బెల్లంపల్లి పట్టణ ప్రజలు నిత్య సంతోషాలతో వర్ధిల్లాలి

- అమ్మవారికి బోనం సమర్పించిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని బోనాల సందర్భంగా అమ్మవారికి బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ బోనం ను సమర్పించారు.ఆదివారం నాడు బెల్లంపల్లి శాసనస భ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బోనాల పండుగ సందర్భంగా బెల్లంపల్లి పట్టణం రడగంబాల బస్తీలో స్థానిక వార్డు కౌన్సిలర్ దామెరవిజయశ్రీనివాస్ ఆధ్వ ర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించగా ఆషాఢ మాసం బోనాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి తోటి కౌన్సిల్ సభ్యులు,స్థా నికమహిళలతో కలిసి స్వయంగా బోనం ఎత్తుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనం సమర్పిం చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దామ స్వాతి మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గంలోని రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాల ని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ పై మాకు నమ్మకం ఉంది

- అజంజాహి మిల్ విఆర్ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



**వరంగల్, బ్యూరో మహా ;** న్యాయ వ్యవస్థ పై తమకు అపారమైన విశ్వాసం ఉందని, ఆ నమ్మకంతోనే కా ర్మికుల పక్షాన పోరాటం చేస్తున్నామని అజంజాహి మిల్స్ విఆర్ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. ఆదివారం వరంగల్ నగ రంలోని చింతల్ బ్రిడ్జి వద్ద వి ఆర్ఎస్ అసోసియేషన్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో మృతి చెందిన తమ తోటి కార్మికులకు రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుడికాల కు మారస్వామి, జన్ను రమేష్ లు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ పై తమకు అపారమైన విశ్వాసం ఉందని ఆ నమ్మకంతోనే అజంజాహి మిల్స్ 19922002 విఆ ర్ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నామ ని తెలిపారు. అజంజాహి మిల్లు 2002లో మూత పడిందని, ఆ సమయంలో మిల్లు యాజమాన్యం అందులో పని చేసిన కార్మికులకు వాలంటరీ రిటైర్మెం ట్ స్కీం ప్రకటించిందని అన్నారు. దింతో 452 ఉంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో 134 మందికి మిల్లు యాజమాన్యం ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మిగిలిన 318 మంది ఉద్యోగులు తమకు కూడా 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నేషనల్ టెక్స్టైల్ కార్పొరేషన్ ను డిమాండ్ చేయగా వారి వినతిని ఎన్టిసి తిరస్కరించిం దని అన్నారు. దీంతో ఆ కార్మికులు హైకోర్టులో కేసు వేయగా న్యాయవాది వాదనతో ఏకీభవించిన హైకోర్టు 2016 మార్చి 18 న కార్మికులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ఎన్ టి సి అప్పీలుకు వెళ్ల డంతో కార్మికుల పక్షాన న్యాయవాది సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. మాడిఫైడ్ వాలంటరీ రిటైర్మెంట్ ఉద్యోగుల సంఘం, కార్మికుల తరఫున న్యా యవాది వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు 318 మంది రిటైర్డ్ ఉద్యోగులు కూడా 200 గజాల స్థలాలు ఇవ్వాలంటూ కూడా, ఎన్ టి సి అధికారులకు 2021 అక్టోబర్ 26న ఆదేశాలు జారీ చేసింది.

**1992-2002 విఆర్ఎస్ కార్మికులకు 200 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలి**

2002 సంవత్సరంలో మిల్లు మూతపడే సమయానికి ముందు పదవి విరమణ పొందిన విఆర్ఎస్ కార్మికుల కు కూడా 200 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి ఆజంజాహి మిల్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున న్యాయ పోరాటం చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కా ర్యదర్శులు కుడికాల కుమారస్వామి జన్ను రమేష్ లు తెలిపారు. మిల్లు యాజమాన్యం స్వార్థపూరిత తప్పుడు నిర్ణయాల కారణంగా 1992 నుంచి 2002 వరకు వీఆర్ఎస్ తీసుకున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, నిజాయితీగా పనిచేసిన కార్మికులకు సరైన ప్రతిఫలాలు అందలేదని, ఆ ఫలితంగానే నేడు 150 మంది వీఆర్ఎస్ కార్మికులు దీనస్థితిలో దుర్భర జీవితాలను కడుతున్నారని, తీవ్ర మనోవేదనకు గురైన కొందరు కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లకు అనుకూలంగా న్యాయ స్థానంలో తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కోశాధికారి పాండవుల సమ్మయ్య, ఈసీ నెంబర్లు తౌటం రమేష్, సంజీవ్, సుమారు 50 మంది వీఆర్ఎస్ కార్మికులు పాల్గొన్నారు.



# బెల్లంపల్లి పట్టణ హమాలీ సమస్యల పరిష్కారానికి కృషి

**బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ వెల్లడి**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణ హమాలి సమస్యల పరిష్కారానికి స్థానికఎమ్మెల్యే గడ్డంవి నోద్ సహకారంతో కృషి చేస్తానని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ వెల్లడించారు. ఆదివారం నాడు హమాలీ సంఘం సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా అక్కడ కాంగ్రెస్ అధ్య క్షుడు బండి ప్రభాకర్ యాదవ్ తో పాటు మంచిర్యాల జిల్లా టిపిసిసి మీడియా కన్వీనర్ దేవసాని ఆనంద్ లకు శాలువాలతో హమాలీ సంఘం అధ్యక్షుడు గెల్లీ రాజలింగు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలి కార్మికుల సంఘానికి అయిందా భవిష్యత్తు లో ఎలాంటి కష్టం వచ్చిన బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ సహకారంతో అన్ని విధాలుగా హమాలి సంఘం యొక్క అభివృద్ధికి ఎలాంటి సమస్య ఉన్న పరిశీలించి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో పెద్ద హమాలి మోఖద్దం కేంశెట్టి సమ్మయ్య తోబాటు పెద్ద సంఖ్యలో హమాలీ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి.
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

**రాజేంద్రనగర్ మహా** ఆషాడ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్ పల్లి, కాటేదాన్, బుద్వేల్ మధుబన్ కాలనీ, పద్మశాలి పురం కాలనీలలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించి, దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించా రు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆషాడ బోనాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాల కు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండా లన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు. వివిధ దేవాలయ ఆలయ కమిటీ సభ్యు, మాజీ కౌన్సిలర్ ప్రేమ్ దాస్ గౌడ్, కృష్ణ గౌడ్, సరికొండ వెంకటేష్, డివిజన్ అధ్యక్షులు ధనుం జయ్,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

- కార్డియాలజీ న్యూరో నెఫ్రాలజీ సేవలు
- వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న సింగరేణి కుటుంబ సభ్యులు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, డైరక్టర్( పా) గౌతమ్ పొట్రు ఆదేశాలతో, సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ సూచనల మేరకు సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల కొరకు ఆదివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రి లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేసి పలు విభాగాలలో సేవలందించారు. హైదరాబాద్ సింధు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే కొత్తగూ డెం మెయిన్ హాస్పిటల్ నందు సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి కార్డియాలజీ, న్యూరా లజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు సేవలు అందించారు.ఈ సందర్భంగా సిఎంఓ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కా ర్మికుల ఉద్యోగుల సంక్షేమం విషయములో ముందు వరుసలో ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉద్యోగులు హైద్రాబాద్ కు వెళ్ళే అవసరం లేకుండా వారి సౌలభ్యం కొరకు హైద్రాబాద్ లో గల అన్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వారిచే మన సింగరేణి ఆసుపత్రులలోనే వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రతీ రెండవ ఆదివారం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపుల ను నిర్వహించుకుంటున్నామని ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ సూపర్ స్పె షాలిటీ మెడికల్ క్యాంపులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 159 మంది రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.అడి షనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు లో హెల్త్ ఆఫీసర్ డి.లలిత, మెయిన్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొ న్నారు.

## యువత రాజకీయాల్లో రాణించాలి

- యువతే దేశానికి భవిష్యత్తు
- జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్

**జవహర్ నగర్, మహా :** యువతే దేశానికి భవిష్యత్తు అని ముఖ్యంగా యువత ప్రస్తుత తరుణంలో రాజకీయాల్లో రాణించాలని... కాక్రోచ్ సమూహమే దీనికి ఉదాహరణ అని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మ అజయ్ పిలుపునిచ్చారు. జవహర్ నగర్ లో ఘనంగా యూత్ కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తోటకూర రాహుల్ యాదవ్ తదితరులు హాజరై జవహర్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం యూత్ కాంగ్రెస్ జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని నాయకులకు సూచించారు. యువతే దేశానికి భవిష్యత్తు అని ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం అభివృద్ధి కోసం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని సూచించారు. యువతే ప్రస్తుతం బంగారు భవిష్యత్తు అని దీనికి ఉదాహరణ ఇటీవల జరుగుతున్న పరిణామాలే అని కాక్రోచ్ జనతా పార్టీ సమూహపు తెగువే ప్రస్తుత ఉదాహరణ అన్నారు. అనంతరం ఆదర్శ ఓల్డ్ ఏజ్ హోమ్ ను సందర్శించి వృద్ధులకు పండ్లు ఫలహారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మాట్ల వినయ్, నాయకం భాస్కర్, బాలకృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు అజయ్, సోమేశ్వర్, సాయి కృష్ణ మహేందర్ శివ కార్తీక్ శ్రీకాంత్ బిట్టు యువకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాయపోల్ బోనాల వేడుకల్లో పాల్గొన్న మల్ రెడ్డి రంగారెడ్డి...

- మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పేర్కొన్న ఎమ్మెల్యే
- గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 9 మహా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో జరిగిన మహంకాళీ బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా... ఎమ్మెల్యే రాకతో సందడిగా మారింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మల్ రెడ్డి రంగారెడ్డికి ఘనస్వాగతం పలికారు. బీరప్ప స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామస్తులు బోనాల వేడుకకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం....**

రాయపోల్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కు చెందిన రూ.20లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే, హెచ్ఎండీఏ నిధులు రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం అభివృద్ధిలో పోటీపడేలా నిధుల కేటాయింపు చేస్తున్నట్లు మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఎంసి వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న పిసిసి నేత రాపోలు రాములు



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్-మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ తిరుమల మెడోస్. బాలాజీ హిల్స్. ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన పలు అమ్మవారి ఆలయాల ఉత్సవాల్లో పిసిసి నేత రాపోలు రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రాపోలు రాములు ఆకాంక్షించారు.

**బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి**

సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని రాపోలు రాములు అన్నారు. ఈ కార్యక్రమాల్లో బోడుప్పల్ డివిజన్ల , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్ది కుటుంబానికి గులాబీ దళపతి భరోసా

- అధైర్య పడకండి అండగా ఉంటామని కేసిఆర్ హామీ
- పిల్లలకు చెరో రూ.కోటి.. అమృతమ్మకు రూ.25 లక్షల సాయం
- కేసీఆర్ రాకతో భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- మాజీ సీఎం కు బందోబస్తు వైఫల్యం
- 30 నిమిషాల పాటు కాన్వాయ్ లోనే కేసీఆర్



**వరంగల్, బ్యూరో మహా :** ఉద్యమ నేత దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటానని గులాబీ దళపతి పెద్ది కుటుంబానికి భరోసా కల్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు పార్టీ తరపున చెరో రూ.కోటి చొప్పున, అలాగే వారి తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించారు. సుమారు 11 ఏళ్ల తర్వాత కేసీఆర్ నల్లబెల్లి కి రావడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రహదారుల వెంట భారీగా జనం నిలవడంతో నల్లబెల్లి లో కెసిఆర్ అభిమానుల సందడి నెలకొంది. కాగా కేసీఆర్ కాన్వాయ్ నల్లబెల్లికి 3 30 నిమిషాలకు చేరుకోగా ఆయన కాన్వాయ్ వద్దకు ఒక్కసారిగా బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సుమారు 30 నిమిషాల పాటు కేసీఆర్ కాన్వాయ్ లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లబెల్లి కి చేరుకున్న కేసీఆర్ ముందుగా పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కెసిఆర్ కొంత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పెద్ది కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలిచే చర్యల్లో భాగంగా ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున చెక్కులను అందించారు. అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో వారి భవిష్యత్తు గురించి కూడా భరోసా కల్పించారు.పెద్ది కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం కేసీఆర్ తిరుగు ప్రయాణంలోనూ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో కాన్వాయ్ వెంట కదిలారు. ఈ సమయంలో కౌశిక్ రెడ్డి మాజీ సీఎం కాన్వాయ్ ముందు నడుస్తూ ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, ఆరూరి రమేష్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాలోత్ కవిత, సత్యవతి రాథోడ్, సంతోష్‌రావు, జీవన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగూర్ల వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన కుషాయిగూడ

**కుషాయిగూడ, మహా :** సింహ వాహిని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం 4:30 గంటలకే ఆలయ తలుపులు తెరిచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మ వారికి తొలిబోనాన్ని సమర్పించి ఉత్సవా లను ప్రారంభించారు. కుషాయిగూడ, చక్రిపురం, శుభోదయం కాలనీ, ద్వారకాపురి కాలనీ, అమ్మవారి బోనాలతో కుషాయిగూడ చర్లపల్లి డివిజన్లో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఆయా ప్రాంతాల్లో కొలువైన పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, భవాని, మహంకాళి తదితర అమ్మవార్ల ఆలయాలకు బోనం సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు. బోనాల జాతర సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి,మాజీ మేయర్. బొంతు రామ్మోహన్. చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, పజూరి పావని మణిపాల్ రెడ్డి,కొత్త రామారావు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కుషాయిగూడ నల్ల పోచమ్మ అమ్మ వారికి భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. కాటమయ్య దేవాలయం అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనాన్ని నివేదించారు. చక్రిపురం మహంకాళి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్. తిరుమల నగర్ కాలనీలో . నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాన్ని సమర్పించిన భాగవతుల శశికళ.



### అమ్మవారిని దర్శించుకున్న, బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా :** ఆషాడ బోనాల సందర్భంగా శంషాబాద్ సర్కిల్ తొండు పల్లి లోని అమ్మవారి దేవాలయని చేవెళ్ల బిజెపి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆషాడ బోనాల సందర్భంగా మ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు బాత్కు శ్రీనివాస్ యాదవ్,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ.. చల్లంగా చూడమ్మా

- మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**కుషాయిగూడ , మహా :** అమ్మవారు... ప్రజలను ఆనందంగా చూడమ్మా, అని తెలంగాణలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని జవహర్ నగర్ దేవేందర్ నగర్ లోని అమ్మవారికి ఆదివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలంగాణలో బోనాల జాతర పెద్దదని అన్నారు. బిఆర్ఎస్ ప్రజల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నేరుస్తుందని గుర్తు చేశారు. అనంతరం కార్యకర్తలను ఉత్సాహపరచారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జట్టా శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్ రామ్, మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్, పల్లపు రవి, సిద్దుల యాదవ్, సతీష్, దేవేందర్ నగర్ వాసులు తదితరులు, అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

- గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్, విద్య, వైద్యం కల్పించాలి
- గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు సోందే కుటుంబరావు



**మణుగూరు, మహా :** గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు పత్రికలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు చేసినప్పుడే గిరిజనులకు నిజమైన న్యాయం జరుగుతుందని గిరిజన సమైక్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సోందే కుటుంబరావు అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మణుగూరులో గిరిజన సమైక్య ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన అనేక చట్టాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేటికీ అనేక గిరిజన గ్రామాలకు కనీస రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోగా అటవీశాఖ అధికారుల నుంచి గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తరతరాలుగా అటవీ ప్రాంతాల్లో జీవిస్తూ సాగు చేసుకుంటున్న గిరిజనులను అడవుల నుంచి దూరం చేసే ప్రయత్నాలు సరికావన్నారు.

**- ఐటీడీఏ నిధులతో గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలి...**

గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం ఐటీడీఏలు ఏర్పాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు అందుబాటులో ఉన్నా అనేక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేక అనేక మంది గిరిజనులు వలస కూలీలుగా మారుతున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాల పరిరక్షణకు జీవో నంబర్ 3 రద్దుతో ఏర్పడిన పరిస్థితికి ప్రత్యామ్నాయంగా గిరిజనుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేసి గిరిజన గ్రామాలకు రహదారులు, వ్యవసాయ బోర్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అర్హులైన నిరుపేద గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలు, చట్టాలు క్షేత్రస్థాయిలో అర్హులైన గిరిజనులకు చేరినప్పుడే ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుందని కుటుంబరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సమైక్య మండల కార్యదర్శి వజ వెంకటేశ్వర్లు, నాయకులు కన్నెబోయిన ప్రసాద్, గారబోయిన నరేష్, సున్నం భాను, కారం రవి, తెల్లం శీను, జంపన్న, కుంజా సాంబశివరావు, మడకం జానీ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో ప్రత్యక్షమైన డాలర్..

- హిమాయత్‌నగర్‌లో వెలుగుచూసిన విదేశీ కరెన్సీ




**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ హుండీలో తొలిసారిగా అమెరికా డాలర్ కనిపించింది. హుండీని తెరిచి లెక్కింపు చేపట్టిన సమయంలో విదేశీ కరెన్సీ నోటు వెలుగుచూసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిపై భక్తితో విదేశీ కరెన్సీని హుండీలో సమర్పించి ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. సాధారణంగా నగదు, నాణేలు, కానుకలు లభించే హుండీలో డాలర్ కనిపించడంతో భక్తులు ఆసక్తిగా చర్చించుకున్నారు. హుండీ లెక్కింపు సందర్భంగా ఈ డాలర్‌ను గుర్తించారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా సాగాలి..

- జల్.. జంగల్.. జమీన్ పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకం..
- పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం..



**మణుగూరు, మహా :** ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మణుగూరులో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. హనుమాన్ టెంపుల్, అంబేద్కర్ సెంటర్ ల వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ అని కొనియాడారు. జల్..జంగల్..జమీన్ నినాదంతో ఆయన సాగించిన పోరాటం ఆదివాసీ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించుకుంటూనే విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

**మౌలిక వసతుల కల్పనకు కృషి..**

ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల పెంపుతో పాటు తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీల గొప్ప చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసే ముఖ్యమైన రోజని పేర్కొన్నారు.

**ఉత్సాహంగా బైక్ ర్యాలీ..**

అనంతరం ఆదివాసీ యువత, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడంతో మణుగూరులో ఆదివాసీ దినోత్సవ వేడుకలు సందడిగా జరిగాయి. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు, పిరినాకి నవీన్, శివ సైదులు, జిల్లా ముఖ్య నాయకులు, మైనారిటీ విభాగం నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా విభాగం నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, యువత, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్థిక కారణాలతో ఉద్యోగావకాశాలు కోల్పోవద్దు...

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 9 మహా:** నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టడమే కాకుండా... ఇక్కడి యువతను ఉన్నత స్థాయికి చేర్చటం కూడా తన సంకల్పమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. జీవితంలో ఎదుగుదలకు వేసే ప్రతీ అడుగులో తమ సహకారం ఉంటుందని యువతకు ఆయన హామీ ఇచ్చారు. మల్ రెడ్డి యువశక్తి, ఎంఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి సారథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ దృష్ట్యా ఆదివారం దరఖాస్తుల స్వీకరణ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భవిష్యత్ మొత్తం యువత చేతుల్లోనే ఉందని... వారు సరైన మార్గంలో వెళ్తేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందని మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఇందులో భాగంగానే ఇక్కడి యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి సారించినట్లు తెలిపారు. అభిషేక్ నేతృత్వంలో చేపట్టిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులంతా వినియోగించుకోవాలని సూచించారు. మన జిల్లాకు పోస్టులు లేవని ఆందోళన చెందుతున్నారని, కొన్ని కారణాలతోనే ఇక్కడ ప్రక్రియ ఆగినట్లు సమాచారం ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, వీలైనంత త్వరగా నోటిఫికేషన్ వచ్చేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు సమయం వృథా చేసుకోకుండా చదువులపై దృష్టి సారించాలని సూచించారు.

**రేపటి జీవితానికి బలమైన పునాది వేసేలా మా ప్రయత్నం: అభిషేక్...**

జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు యువత చేస్తున్న ప్రయత్నాలకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని మల్ రెడ్డి యువశక్తి సారథి మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు. సివిల్స్ స్థాయిలో రాష్ట్ర పోలీస్ ఉద్యోగాలకు పోటీ, సిలబస్ ఉన్న తరుణంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా ప్రిపరేషన్ పైనే దృష్టిసారించాలని చెప్పారు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తాము చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజు, సీఐ మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగా రెడ్డి, నాయకులు మహిపాల్, పాండురంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, ముత్యాల రాజశేఖర్ రావు, మంకాల దాసు, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జయమ్మ, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ భాస్కరాచారి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్, ఫిజిక్స్ ఫ్యాకల్టీ రమేశ్ తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఎస్ఐ కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.



# చెన్నైలో అమిత్‌షాకు ఘన స్వాగతం

**కేంద్ర హోంమంత్రిని కలిసిన పుంగులేటి సుధాకర్‌రెడ్డి.**

**చెన్నై, మహా :** కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్ర నేత అమిత్‌షాకు చెన్నై విమానాశ్రయంలో పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. బీజేపీ జాతీయ సహ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పుంగులేటి సుధాకర్‌రెడ్డి, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌తో పాటు పలువురు పార్టీ నేతలు విమానాశ్రయానికి చేరుకుని అమిత్‌షాకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అమిత్‌షాతో పుంగులేటి సుధాకర్‌రెడ్డి కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిణామాలు, రానున్న కార్యక్రమాలపై నేతలు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తమిళనాడులో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో అమిత్‌షా పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.తమిళనాడులో పార్టీ విస్తరణ, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలను రాజకీయంగా ప్రస్తావించడం వంటి అంశాలపై పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో కేంద్ర నాయకత్వం నుంచి రాష్ట్ర నేతలకు అందుతున్న మార్గదర్శకాలు పార్టీ రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.అమిత్‌షాకు స్వాగతం పలికిన వారిలో పలువురు బీజేపీ రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. విమానాశ్రయంలో నేతల భేటీ అనంతరం అమిత్‌షా తదుపరి కార్యక్రమాలకు బయలుదేరారు.



# బొగ్గు బ్లాకులను కేటాయించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కోయగూడెం ఓసి3, జే వి ఆర్ ఓ సి3 బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సి సి ఎల్ )కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బి ఎం ఎస్)కార్యదర్శి నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి.మాధవ నాయక్, ఎస్ సి ఎంకేఎస్ అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార్ స్వామి ఆదివారం స్వయంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోసింగరేణి యాజమాన్యాన్ని ఈ బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో పాల్గొనకుండా అడ్డుకుని ప్రైవేట్ సంస్థలకు కేటాయించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. సింగరేణికి కొత్త గనులు అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికే ఉన్న గనుల బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయని కొన్ని గనులు మూసివేత దశకు చేరుకోవడంతో ఈ ఏడాది సుమారు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన కోయగూడెం, జేవిఆర్ ఓసి3 బ్లాకుల్లో ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాకపోవడానికి భూసేకరణ సమస్యలు చట్టపరమైన వివాదాలు గిరిజన ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన నియంత్రణలు స్థానిక సమస్యలు వివిధ అనుమతుల్లో జాప్యం వంటి కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు కోయగూడెం ఓసి3 కీలకమన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతం నేడు కొత్త గనులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. గనులు తగ్గిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేస్తున్నారని ఫలితంగా స్థానిక ప్రజల ఉపాధి అవకాశాలు ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కోయగూడెం, జేవిఆర్ బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే ఈ ప్రాంతానికి సమీపంలోని బొగ్గు వనరులను వినియోగించుకోవడంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. సింగరేణికి కేటాయిస్తే అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ బ్లాకులు సింగరేణికి లభిస్తే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు భారీ యంత్రాలు రవాణా వ్యవస్థలు స్థానిక భౌగోళిక పరిజ్ఞానం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. సమీపంలోని ఖాళీ గని ప్రాంతాలను ఓవర్‌బర్డెన్ డంపింగ్‌కు వినియోగించడం ద్వారా భూసేకరణ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో బొగ్గు ఉత్పత్తి పెరిగి దక్షిణ భారత విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా బలోపేతం అవుతుందని సింగరేణి ఉద్యోగుల భద్రతతో పాటు రాష్ట్ర దేశ ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇటీవల మణుగూరు డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు బొగ్గు గని సింగరేణికి దక్కేలా చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తెలపడంతో పాటుగా అదే తరహాలో కోయగూడెం, జివిఆర్3బొగ్గు బ్లాకుల విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేటాయింపులపై సమగ్ర సమీక్ష జరిపి చట్టపరంగా సాధ్యమైన విధానాల ప్రకారం అవసరమైతే డీఅలోకేషన్ చేసి పునఃకేటాయింపు లేదా పునఃవేలం ద్వారా సింగరేణికి అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతాన్ని కాపాడుకోవాలని సంవత్సరాల తరబడి ఉపయోగంలోకి రాని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల ఉద్యోగ భద్రత స్థానిక ప్రజల ఉపాధి సింగరేణి భవిష్యత్తు బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ కమిటీ మెంబర్ పులి రాజారెడ్డి, అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జీవీ కృష్ణారెడ్డి, కోశాధికారి సాయి వేణి సతీష్, ఇల్లందు ఏరియా కార్యదర్శి లీలా కృష్ణ, భూపాల్ పల్లి ఏరియా ఉపాధ్యక్షులు సుజేందర్, భూపాల్ పల్లి కార్యదర్శి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

- **భాష సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి**
- **ఆదివాసీ యువత విద్య ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**
- **అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవాన్ని భాష సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంతోపాటు ఆదివాసీ యువత విద్య ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి దానసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్స్‌లతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవం స్వేచ్ఛ సమానత్వం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు. కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్కసారలమ్మ చేసిన పోరాటం నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాల వరకు ఆదివాసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు. అడవిపై హక్కులు భూమిపై హక్కులు విద్య ఉపాధి గృహాలు తదితర ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆదివాసీ ప్రాంతాల నుంచి తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరి వినతిని ఓపికగా విని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.స్కిల్ డెవలప్‌మెంట్ గిరిజన సంక్షేమం పంచాయతీరాజ్ రోడ్లుభవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.కొమరం భీమ్ “జల్, జంగల్, జమీన్” నినాదంతో పోరాటం చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్లు నిధులు నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఆదివాసీల భాష సంస్కృతి సంప్రదాయాలు పండుగలు గోత్రాలు జీవన విధానమే వారి అస్తిత్వమని మంత్రి సీతక్క అన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా తమ మూలాలను మాతృభాషను సంస్కృతిని సంప్రదాయాలను మరచిపోకూడదని సూచించారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

**ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి...**

ఆదివాసీ సమాజంలో ఐక్యత చైతన్యం విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం గిరిజన విద్యా వికాశం భవనం ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.

**ఆదివాసీ సంక్షేమం పరిరక్షణకు ప్రాధాన్యత..**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.కొమరం భీమ్ రాంజీ గోండు సమ్మక్కసారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష సంస్కృతి సంప్రదాయాలు వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య వైద్యం మౌలిక వసతులు ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు.ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ హక్కులు బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్లోబల్ పాలసీలు కాదు

- **భారత చట్టాలే ముఖ్యం.**
- **మెటాకు కేంద్రం స్పష్టీకరణ.**
- **కంటెంట్ మోడరేషన్‌లో స్థానిక భాషలు, సంస్కృతిపై అవగాహన ఉండాలి.**
- **డీప్‌ఫేక్‌లపై ‘జీరో టాలరెన్స్**

ఢిల్లీ, మహా. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తమ సొంత గ్లోబల్ పాలసీల కంటే భారతీయ చట్టాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దేశ చట్టాలకు అనుగుణంగానే కంటెంట్ పాలసీలు, కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌ను అమలు చేయాలని మెటాకు కేంద్రం సూచించినట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వెలువడ్డాయి. ్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఓ వీడియో బ్లాక్ కావడం, మెటా అనుసరిస్తున్న కంటెంట్ విధానాలపై సంస్థ ప్రతినిధులతో కేంద్రం చర్చలు జరుపుతున్న సమయంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే మెటా అల్గారిథమ్‌ను పూర్తిగా మార్చాలని కేంద్రం ఆదేశించిందన్న ప్రచారంలో వాస్తవం లేదని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం.

స్థానిక భాషలు, సంస్కృతిపై అవగాహన అవసరంభారత్‌లోని విభిన్న భాషలు, సంస్కృతులు, సామాజిక పరిస్థితులను విదేశాల్లోని మెటా కంటెంట్ మోడరేషన్ బృందాలు పూర్తిస్థాయిలో అర్థం చేసుకోలేకపోతున్నాయని కేంద్రం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కంటెంట్‌ను సమర్థంగా సమీక్షించేందుకు స్థానిక భాషలు, ప్రాంతీయ సంస్కృతిపై అవగాహన ఉన్న నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించినట్లు సమాచారం.

భారతీయుల మనోభావాలను దెబ్బతీసే, నిబంధనలకుబ విరుద్ధమైన కంటెంట్‌పై కేంద్రం కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి కంటెంట్ ప్లాట్‌ఫామ్‌లపై కొనసాగడం తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించాలని, ఫిర్యాదులు వచ్చినప్పుడు తక్షణమే చర్యలు తీసుకోవాలని మెటాకు సూచించినట్లు తెలుస్తోంది.

డీప్‌ఫేక్‌లపై మానవ పరిశీలన తప్పనిసరి అధికారిక, వెరిఫైడ్ ఖాతాల నుంచి వచ్చే కంటెంట్‌ను పొరపాటుగా డీప్‌ఫేక్‌గా గుర్తించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా సున్నితమైన కంటెంట్‌ను కేవలం ఆటోమేటెడ్ ఏఐ వ్యవస్థల నిర్ణయానికే వదిలేయకుండా ‘హ్యూమన్‌ఇన్‌దిలూప్’ విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఎదగాలి

- **రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి దానసరి అనసూయ**
- **పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఇందిరమ్మ స్ఫూర్తితో ప్రతి మహిళ ఎదగాలనిరాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ అన్నారు. ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అనసూయ శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. మహిళలు జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మంత్రి అన్నారు. ఇందిరాగాంధీ జీవితాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ ధైర్యంగా నిలబడి దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎదిగిన ఇందిరాగాంధీని ‘ఐరన్ లేడీ’గా దేశం గుర్తించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో ప్రతి మహిళ కూడా కష్టాలను అధిగమించి ఉక్కు మహిళగా ఎదగాలని ఆకాంక్షించారు.కుటుంబ సమస్యలు ఆర్థిక ఇబ్బందులు ఇతర సవాళ్లు ఎదురైనప్పుడు మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని మంత్రి సూచించారు. కష్టాలు వచ్చినప్పుడు నిరాశ చెందకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని అన్నారు. మహిళలు ఐక్యంగా ఉండి పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మహిళలకు మౌలిక వసతులు ఆర్థిక సహాయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీలు అందించినట్లు తెలిపారు. మహిళల పేరుతో రుణాలు అందించి వారు స్వయం ఉపాధి చిన్నతరహా పరిశ్రమలు ఉత్పత్తి కార్యకలాపాలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.రుణాలను వృథా చేయకుండా ఆదాయం వచ్చే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సూచించారు. ప్రారంభ దశలో కొంత కష్టంగా అనిపించినప్పటికీ క్రమశిక్షణతో ఐక్యంగా కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో మహిళలు వారి కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని అన్నారు.ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్న స్థానిక వనరులను గుర్తించి వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవాలని మంత్రి సూచించారు. కారం పొడి పసుపు మామిడి ఆధారిత ఉత్పత్తులు కోళ్ల పెంపకం పుట్టగొడుగుల పెంపకం చిన్నతరహా యంత్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను మహిళా సంఘాలు చేపట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో తయారు చేసే ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌తో పాటు హైదరాబాద్ ఇతర పట్టణాలు ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా తమ స్వశక్తితో సంపాదించి కుటుంబాలను నడిపించే స్థాయికి ఎదగాలని మంత్రి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రుణాలు శిక్షణ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, డిఆర్డిఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓసి-4లో కార్మికుడి మృతిపై అనుమానాలు

- **నిజాలు బయటపెట్టాలి.. సమగ్ర విచారణ జరపాలి**
- **రేణుక అక్షర మహిళా మండలి నేత పూణెం సరోజ డిమాండ్..**



**మణుగూరు, మహా :** మణుగూరు ఓసీ4లో దుర్గా కంపెనీ పరిధిలో లోడర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన రాం బహదూర్ పటేల్ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని రేణుక అక్షర మహిళా మండలి నాయకురాలు పూణెం సరోజ డిమాండ్ చేశారు. కార్మికుడు ఏ పరిస్థితుల్లో మృతి చెందాడు? ఘటన ఎక్కడ, ఎలా జరిగింది? ఘటన అనంతరం ప్రాథమిక చికిత్స అందించారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆమె కోరారు. ముఖ్యంగా మృతుడిని సమీపంలోని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి లేదా సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించకుండా నేరుగా భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు కార్మికులు చెబుతున్నారని, దీనిపై యాజమాన్యం స్పష్టమైన వివరణ ఇవ్వాలని అన్నారు.

**- ఆసుపత్రికి తరలింపుపై స్పష్టత ఇవ్వాలి..**

సమీప ఆసుపత్రికి తీసుకెళ్లకుండా మరో ప్రాంతంలోని ఆసుపత్రికి ఎందుకు తరలించాల్సి వచ్చిందో వెల్లడించాలని సరోజ డిమాండ్ చేశారు. ఈ పరిణామం కార్మికుల్లో పలు అనుమానాలకు తావిస్తోందని, యాజమాన్యం పూర్తి వివరాలను వెల్లడించి వాటికి తెరదించాలని కోరారు. విధుల్లో ఉన్న కార్మికుడి మృతికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం అందించి, వారి సమక్షంలో నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. పోస్టుమార్టం నివేదికతో పాటు అధికారిక విచారణ ద్వారానే మృతికి అసలు కారణం వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు.

**- జీఎం బాధ్యత వహించాలి..**

ఈ ఘటనపై మణుగూరు సింగరేణి జీఎం బాధ్యతగా స్పందించి, కార్మికులకు స్పష్టమైన సమాధానం చెప్పాలని పూణెం సరోజ డిమాండ్ చేశారు. జీఎం స్థాయిలో పూర్తి వివరాలు వెల్లడించని పక్షంలో సింగరేణి ఉన్నతాధికారులు ప్రత్యేక సంస్థాగత విచారణ చేపట్టాలని కోరారు. ఓసీ4లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ఘటన సమయంలో పాటించాల్సిన అత్యవసర చర్యలు తీసుకున్నారా? ప్రమాద స్థలం నుంచి ఆసుపత్రికి తరలించే వరకు ఏం జరిగింది? అనే అంశాలన్నింటినీ జిల్లా అధికారులు, కార్మిక శాఖ, పోలీసులు విచారించాలని కోరారు. నిర్లక్ష్యం లేదా తప్పిదం ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలు, భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఘటనకు సంబంధించిన నిజాలు బయటకు రాకుండా వ్యవహారాన్ని నీరుగార్చే ప్రయత్నం జరిగితే తీవ్రంగా వ్యతిరేకిస్తామని సరోజ హెచ్చరించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు కార్మికుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేలా సింగరేణి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా రేణుక అక్షర మహిళా మండలి జనరల్ సెక్రటరీ రెడ్డిబోయిన రేణుక, దేరంగుల సుజాత, బాడిష పార్వతి తదితరులు పాల్గొన్నారు.





# పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మ గుడి)లో అమ్మవారు శాకంభరి అలంకరములో శాకంభరిదేవిగా భక్తులకు ధర్శనమిచ్చారు. ఉదయం నుండి వేలాదిమంది భక్తులు క్యూలైన్లలో వరుసక్రమంలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యములు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. దాతల సౌజన్యంతో వచ్చిన భక్తులందరికీ ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచిత ప్రసాద వితరణ తాగునీరు తదితర ఏర్పాట్లు చేయడం జరిగింది.రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సంవృద్ధిగా పండాలని అమ్మవారిని భక్తులు వేడుకుంటు భక్తులు వివిధ రకాల కూరగాయలు సమర్పించియున్నారు. అనంతరం అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అమ్మవారి అలంకరణకు పలు విధములైన కూరగాయలు ఉచిత ప్రసాద వితరణ నకు సంకారామారావు సురేష్ దాతులుగా వ్యవహరించినారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎ.విజయ్ కుమార్, మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, మాజీ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.

## దక్షిణాది సినీ పరిశ్రమలో దూసుకుపోతున్న యువ నటి

తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జన్మించిన ఈ అందాల తార.. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నిట్‌లో చదువుకున్న ఆమె చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్నారు. ముఖ్యంగా నృత్యంలో శిక్షణ పొందిన ఆమె.. తన ప్రతిభతో పాటు అందం, అభినయంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు.సినిమాల్లోకి రాకముందే పలు సంగీత వీడియోల్లో కనిపించి మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా 'ఆసా కూడ' వంటి వైరల్ మ్యూజిక్ వీడియోలు ఆమెకు సోషల్ మీడియాలో భారీ క్రేజ్‌ను తీసుకొచ్చాయి. ఆ తర్వాత 'ముట్టుము2' వంటి మ్యూజిక్ వీడియోలతోనూ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఈ వీడియోల్లో ఆమె చూపించిన నృత్య ప్రతిభ, సహజమైన హావభావాలు యువతలో ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. 2024లో విడుదలైన తెలుగు హారర్ కామెడీ చిత్రం 'ఓం భీమ్ బుష్'తో వెండితెరపై అడుగుపెట్టారు. ఈ సినిమాలో జలజ పాత్రలో కనిపించిన ఆమె.. తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. అనంతరం తమిళంలో కథానాయికగా 'స్టార్' సినిమాలో నటించే అవకాశం దక్కించుకున్నారు. కవిన్ సరసన మీరా మలర్కొడి పాత్రలో కనిపించి తమిళ ప్రేక్షకులను మెప్పించారు. ప్రేమ, భావోద్వేగాలతో కూడిన ఈ పాత్రలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. ఒక భాషకే పరిమితం కాకుండా తెలుగు, తమిళ చిత్రాల్లో వరుసగా అవకాశాలు అందుకుంటూ తన కెరీర్‌ను వేగంగా విస్తరించుకున్నారు. ఆ తర్వాత 'కన్నప్ప' చిత్రంతో పాటు మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టారు. 'మైన్ ప్యార్ కియా', 'సర్వం మాయ' వంటి చిత్రాల్లో నటిస్తూ భాషల పరంగా తన పరిధిని మరింత పెంచుకున్నారు. విభిన్న కథలు, భిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటనా సామర్థ్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2026లో వచ్చిన 'బ్లాస్ట్', 'ఇదయం మురళి' చిత్రాల్లోనూ ఆమె కీలక పాత్రల్లో కనిపించారు. ఈ సినిమాల్లో ఆమె ప్రదర్శించిన నటనకు మంచి స్పందన రావడంతో పాటు.. ప్రతిభావంతమైన యువ నటిగా పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో ఐఎండీబీ నుంచి బ్రేకౌట్ స్టార్‌గా గుర్తింపు పొందడం ఆమె కెరీర్‌లో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ప్రస్తుతం 'ఎమో ఎమో ఇది', 'దశమకన్'తో పాటు మరికొన్ని బహుభాషా చిత్రాల్లో నటిస్తున్నారు. వరుసగా కొత్త అవకాశాలు అందుకుంటూ తెలుగు, తమిళం, మలయాళం చిత్ర పరిశ్రమల్లో తన స్థానాన్ని బలపరుచుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి కథానాయికగా ఎదగాలని ఆమె ప్రయత్నిస్తున్నారు. తక్కువ సమయంలోనే మ్యూజిక్ వీడియోల నుంచి వెండితెరకు, అక్కడి నుంచి పలు భాషల సినిమాల వరకు ప్రయాణం సాగించిన ఈ యువ నటి.. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో వేగంగా ఎదుగుతున్న నటీమణుల్లో ఒకరిగా నిలుస్తున్నారు.





## మమితా బైజు కీలక నిర్ణయం.. సోషల్ మీడియాకు దూరం

'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులతో పాటు దక్షిణాది సినీ అభిమానులకు చేరువైన మలయాళ నటి మమితా బైజు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియాలో లభించే ప్రచారం కంటే తన మానసిక ప్రశాంతతకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని ఆమె వెల్లడించారు. ఇకపై తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను తరచుగా పంచుకోకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తన కొత్త సినిమాలు, షూటింగ్ వివరాలు, ఇతర అధికారిక సమాచారాన్ని ఇకపై తన ప్రచార బృందం ద్వారా అభిమానులకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమితా బైజు తన సినీ ప్రయాణంతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తనకు సోషల్ మీడియాలో వచ్చే గుర్తింపు కంటే ప్రశాంతమైన జీవితం ముఖ్యమని చెప్పారు. సినిమా రంగంలో నిరంతరం అందుబాటులో ఉండటం, ప్రతి విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల కొంత ఒత్తిడి ఎదురవుతుందని, అందుకే వ్యక్తిగత జీవితానికి కొంత సమయం కేటాయించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అల్లు అర్జున్‌కు వీరాభిమాని**

మమితా బైజు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు వీరాభిమానినని తెలిపారు. ఆయన నటించిన సినిమాలను ఒకటి కంటే ఎక్కువ సార్లు చూసిన సందర్భాలు చాలా ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా 'ఇద్దరమ్మాయిలు' సినిమాలో అల్లు అర్జున్ ధరించిన దుస్తులు, ఆయన స్టైలింగ్ తనను బాగా ఆకట్టుకున్నాయని గుర్తుచేసుకున్నారు. ఆ సినిమాలో ఆయన ధరించిన క్యాసియో వాచ్, ఫుల్ స్లీవ్ టీషర్ట్ స్టైల్ తనకు బాగా నచ్చడంతో అప్పట్లో తాను కూడా అదే తరహా స్టైల్‌ను అనుసరించేదానినని సరదాగా వెల్లడించారు.

**చదువులోనూ ప్రతిభ**

కేరళలోని కొట్టాయం ప్రాంతానికి చెందిన మమితా బైజు కుటుంబ నేపథ్యం కూడా ఆసక్తికరంగానే ఉంది. ఆమె తండ్రి వైద్యుడిగా పనిచేస్తున్నారు. మమితా సైకాలజీలో డిగ్రీ పూర్తి చేశారు. చదువుతో పాటు నటనపై ఆసక్తిని పెంచుకున్న ఆమె.. క్రమంగా మలయాళ చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. సహజమైన నటన, తెరపై చలాకీతనం, భావోద్వేగాలను పలికించే విధానం ఆమెకు ప్రత్యేకమైన అభిమానులను తీసుకొచ్చాయి.

**అన్నయ్యే తనకు మార్గదర్శి**

తన అన్నయ్య మిథున్ గురించి కూడా మమితా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. మిథున్ రాష్ట్రస్థాయి క్రికెటర్ అని, తన జీవితంలో తీసుకునే పలు ముఖ్యమైన నిర్ణయాల్లో ఆయన సలహా కీలకంగా ఉంటుందని చెప్పారు. కుటుంబపరమైన విషయాల్లోనూ అన్నయ్య మాటకు తాను ఎంతో విలువ ఇస్తానని పేర్కొన్నారు. అంతేకాదు, తన పెళ్లికి సంబంధించిన నిర్ణయంలోనూ అన్నయ్య సూచనకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. తనకు వచ్చే ప్రేమ ప్రతిపాదనలను కూడా కొన్నిసార్లు అన్నయ్యే చూసుకుంటారని సరదాగా చెప్పడంతో ఈ వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తించాయి.

**వరుస అవకాశాలతో బిజీ**

'ప్రేమలు' సినిమా విజయంతో మమితా బైజు కెరీర్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఈ చిత్రం తర్వాత ఆమెకు దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. దీనితో పాటు మూడు భాషల్లో రూపొందుతున్న మరికొన్ని ప్రాజెక్టుల్లోనూ ఆమె భాగమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ నటిగా తన పరిధిని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న మమితా.. రాబోయే రోజుల్లో మరింత బిజీగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వరుణ్ తేజ్‌కు కొత్త ఊపు.. 'కొరియన్ కనకరాజు'తో సక్సెస్ బాట

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. బాలనటుడిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన.. 'ముకుంద' చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'కంచె', 'ఫిదా', 'తొలిప్రేమ', 'అంతరిక్షం' వంటి విభిన్న కథా చిత్రాల్లో నటిస్తూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే ఇటీవల వరుణ్ తేజ్ నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో భారీ విజయాలను అందుకోలేకపోయాయి.ఇటీవల నటి లావణ్య త్రిపాఠిని వివాహం చేసుకున్న వరుణ్ తేజ్.. తండ్రిగా మారిన తర్వాత తన కెరీర్‌పై మరింత దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో కొత్త తరహా కథను ఎంచుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇండోకొరియన్ నేపథ్యంతో కామెడీ, హారర్ అంశాలను మేళవించిన 'కొరియన్ కనకరాజు' చిత్రంలో ఆయన సరికొత్త పాత్రలో కనిపించారు.ఈ సినిమాలో 'మిరాయ్'తో విజయాన్ని అందుకున్న రితికా నాయక్ కథానాయికగా నటించగా, ప్రముఖ హాస్యనటుడు సత్య కీలక పాత్రలో కనిపించారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 7న థియేటర్లలో విడుదలైంది. విడుదలకు ఒక రోజు ముందుగానే తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించినట్లు చిత్ర బృందం తెలిపింది. తొలి ప్రదర్శనల నుంచే సినిమాపై సానుకూల స్పందన రావడంతో థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరిగింది. తొలుత 125 ప్రదర్శనలను ప్లాన్ చేయగా, వాటిలో సుమారు 100 థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించినట్లు సమాచారం. ఆ తర్వాత కూడా టికెట్ బుకింగ్స్ వేగం పెరగడంతో వసూళ్లు మెరుగయ్యాయి. మూడు రోజుల్లోనే సినిమా లాభాల దిశగా అడుగులు వేసిందనే వార్తలతో పంపిణీదారుల్లోనూ ఉత్సాహం పెరిగింది. ప్రేక్షకుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని కొన్ని ప్రాంతాల్లో అదనపు థియేటర్లను, మరిన్ని షోలను పెంచుతున్నట్లు సమాచారం. ఈ చిత్రం వరుణ్ తేజ్ కెరీర్‌కు మరోసారి మంచి ఊపు నిచ్చే విజయంగా నిలుస్తుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.



## మహేష్‌కు సితార స్పెషల్ బర్త్‌డే విషెస్

సూపర్‌స్టార్ మహేష్ బాబుకు కుమార్తె సితార ఘట్టమనేనితో ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తండ్రి అంటే సితారకు ఎంతటి అభిమానం, ప్రేమ ఉందో ఆమె సోషల్ మీడియా పోస్టుల్లో తరచూ కనిపిస్తూనే ఉంటుంది. తాజాగా మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా సితార చేసిన ప్రత్యేక పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

తన తండ్రితో కలిసి ఉన్న అందమైన ఫొటోను సితార సోషల్ మీడియాలో పంచుకుంది. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. నువ్వెప్పుడూ నా ఫేవరెట్ పర్సన్‌వే. లవ్ యు ఆల్వేస్' అంటూ ప్రేమతో కూడిన సందేశాన్ని రాసింది. ఈ పోస్ట్‌కు మహేష్ భార్య నమ్రతా శిరోద్కర్ హార్ట్ ఎమోజీలతో స్పందించగా.. అభిమానులు పెద్ద ఎత్తున లైకులు, కామెంట్లతో తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.

సితార పోస్ట్ చేసిన ఫొటోలో తండ్రి, కుమార్తె మధ్య ఉన్న ఆప్యాయత అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. పలువురు అభిమానులు తండ్రీకూతుళ్ల బంధాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేశారు. అయితే ఈ ఫొటోలో మహేష్ బాబు ఫిట్‌నెస్ కూడా ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది.

మహేష్ చేతిపై స్పష్టంగా కనిపించిన నరాలను అభిమానులు గమనించారు. ఆయన శారీరక దారుఢ్యాన్ని ప్రశంసిస్తూ 'ఆ నరాలు ఏంటి అన్నా.. వాట్ ఎ ఫిట్‌నెస్' అంటూ కొందరు కామెంట్లు చేశారు. వయసు పెరుగుతున్నా మహేష్ మరింత యంగ్‌గా, ఫిట్‌గా కనిపిస్తున్నారంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఆయన మేకోవర్, స్టైలిష్ లుక్‌పై కూడా అభిమానులు ఆసక్తికరమైన కామెంట్లు చేస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com